# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**

**LEGISLATIVE COUNCIL DEBATES**

అధికార నివేదిక

# OFFICIAL REPORT

సోమవారం, మార్చి 27, 2017,

ఇరవై ఎనిమిదవ సమావేశం, సంపుటం–3, నంబరు–1,

దుర్ముఖి నామ సం.ఫాల్గుణ బ.14

**MONDAY, THE 27TH DAY OF MARCH, 2017,**

**TWENTY EIGHTH SESSION, VOLUME - 3, NO.1**

**6TH, CHAITRA 1938 S.E.**

*****

శాసన పరిషత్తు సచివాలయము,

వెలగపూడి,

అమరావతి – 522503.

**LEGISLATURE SECRETARIAT,**

**VELAGAPUDI,**

**AMARAVATHI - 522503.**

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | : | డా. ఎ. చక్రపాణి |
| **డెప్యూటీ ఛైర్మన్** | : | శ్రీ వెంకట సతీష్ కుమార్ రెడ్డి సింగారెడ్డి |
| **ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక** | : | శ్రీమతి పమిడి శమంతకమణి<br>శ్రీ వాకాటి నారాయణ రెడ్డి<br>శ్రీ బొడ్డు నాగేశ్వర రావు<br>శ్రీ మెట్టు గోవిందరెడ్డి |
| **కార్యదర్శి (ఇన్‌ఛార్జ్)** | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎమ్. విజయరాజు |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజ్‌కుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకర్‌రావు |
| **చీఫ్ రిపోర్టర్** | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు

## సోమవారం, మార్చి 27, 2017.

## అధికార నివేదిక

---

## విషయ సూచిక

---

**(1)**సభా కార్యక్రమం – ప్రకటన
**(2)**సభా కార్యక్రమం –వాయిదా తీర్మానం
**(3)**ప్రశ్నోత్తరాలు
**(4)**ప్రత్యేక ప్రస్తావనలు
**(5)**సాంఘిక భద్రతా పథకాలపై చర్చ కొనసాగింపు – మంత్రివర్యుల ప్రత్యుత్తరం
**(6)**సభా కార్యక్రమం – ప్రకటన

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్

## సోమవారం, 27వ తేదీ, మార్చి, 2017

----

( సభ ఉదయం 10.00 గంటలకు సమావేశమైనది )

( గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు )

----

### 1.సభా కార్యక్రమం – ప్రకటన

MR.CHAIRMAN: I am to announce to this House that there will be a presentation of live telecast programme of Polavaram Project at 11.15 a.m. today in the Committee Hall. All the Members are requested to take part in Room No.1.

### 2. సభా కార్యక్రమం – వాయిదా తీర్మానం

Today I have received one Adjournment Motion.

The Adjournment Motion given notice of by Sri Boddu Nageswara Rao, Sri Yandapalli Srinivasulu Reddy and Dr. M. Geyanand to discuss about regularization of services of contract and outsourcing employees of Medical and Health Department has been disallowed.

శ్రీ బొడ్డు నాగేశ్వర రావు (పట్టభద్రుల నియోజకవర్గం – కృష్ణా, గుంటూరు): ఈ రాష్ట్ర పరిపాలన అంతా కూడా కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ద్వారానే జరుగుతున్నది సార్. అటువంటి ఈ విషయంపై సభలో చర్చించాలని మేము కోరుతున్నాము. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా వైద్య, ఆరోగ్య రంగంలో వివిధ విభాగాలలో 13 రకాల ఉద్యోగులు పనిచేస్తున్నారు. దాంతోపాటు స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలలో కూడా 10 రకాల ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరందరికీ చాలీచాలని జీతాలు ఇస్తున్నారు. జీ.వో. నెం.151 ప్రకారం వీరందరికీ 10వ పి.ఆర్.సి.ని వర్తింపచేయాలని విజయవాడలో వేలాది మంది ధర్నా చేస్తున్నారు. జీ.ఓ.నెం.151 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలనేది ఒకటి, అలాగే, స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్నవారికి 9 నెలల నుండి 14 నెలల వరకూ గౌరవ వేతనం కూడా లేకుండా ఇబ్బందిపడే కార్మికులున్నారు. వారికి తక్షణం వేతనం చెల్లించాలి. మహిళలకు 180 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవును కూడా ఇప్పించాలి. వాటితోపాటు ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పి.ఎఫ్. లాంటి సౌకర్యాలను కల్పించాలని కోరుతున్నాను. ఇటీవల సుప్రీంకోర్టు తెలిపినట్లు సమాన పనికి సమానవేతనాన్ని రాష్ట్రప్రభుత్వం అమలు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను.

డా. ఎం.గేయానంద్ (పట్టభద్రుల నియోజకవర్గం – కర్నూలు, అనంతపురం, కడప): (మైక్ లేదు) సార్, ఇది చాలా ముఖ్యమైన అంశం. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అంశంపై చర్చ జరగాలి. వేలాదిమంది విజయవాడలో రోడ్డు మీద ఉన్నారు.

మిస్టర్ ఛైర్మన్ : నేను డిస్-ఎలౌ చేశాను. మెడికల్ అండ్ హెల్త్ మీద షార్ట్ డిస్కషన్ ఉన్నది. అప్పుడు మాట్లాడుకోవచ్చు.

## 3.ప్రశ్నోత్తరాలు

### గుంటూరు నగరపాలక సంస్థకు ప్రత్యేక గ్రాంటు

ప్రశ్న నెం.9384(102)

సర్వశ్రీ మహ్మద్ జానీ,
పీరుకట్ల విశ్వప్రసాద రావు , ఎం.ఎల్.సిలు

గౌరవనీయులైన పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా?

అ) కేంద్రప్రభుత్వం గుంటూరు మునిసిపల్ కార్పోరేషన్‌కు ప్రత్యేక గ్రాంటును ఇచ్చిందా?
ఆ) అయితే, సదరు మొత్తాన్ని ఏ ప్రయోజనం కోసం వినియోగించడమయింది?

గౌరవనీయులైన పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు (శ్రీ పి. నారాయణ) :

అ) అవునండీ.
ఆ) ఈ మొత్తాన్ని గుంటూరు మునిసిపల్ కార్పోరేషన్ లోని భూగర్భ డ్రైనేజీ పథకానికి వినియోగించడమయింది.

శ్రీ మహ్మద్ జానీ (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, కేంద్రభుత్వం దాదాపు రూ.540 కోట్లను మంజూరు చేసింది. అసలు మొత్తం ఖర్చు ఎంత, ఎంత ఖర్చుపెట్టారు, దేనికి ఎంత ఖర్చుపెట్టారనే వివరాలు తెలియచేయాలని మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ సోము వీర్రాజు (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, రూ.1000 కోట్లు కేంద్రం నుండి వస్తే, రూ.500 కోట్లు విజయవాడకు, రూ.500 కోట్లు గుంటూరుకు విభజించిన సందర్భంలో డ్రైనేజీ కాకుండా, ఇంకా ఏ ఇతర అంశాలపైన ఈ నిధులను వినియోగిస్తున్నారో తెలియచేయవలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పి. నారాయణ: అధ్యక్షా, గుంటూరుకు తీసుకున్న మొత్తం ప్రాజెక్టు కాస్ట్ రూ.903.82 కోట్లు. అందులో కేంద్రప్రభుత్వం రూ.540 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్రప్రభుత్వం యుఎల్‌బి కలిసి రూ.363.82 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. టెండర్లు రూ.853.35 కోట్లకు తేది. 21.7.2016న ఫైనలైజ్ చేయడం జరిగింది. అగ్రిమెంట్ తేది. 08.09.2016న జరిగింది. మేజర్‌గా గుంటూరులో 1,083.00 కి.మీ. సివరేజ్ నెట్‌వర్క్‌ని ఆ ప్రాజెక్టులో చేర్చడం జరిగింది. అదేవిధంగా 127 ఎంఎల్‌డిల ఎస్‌టిపిలకు జూన్ నెలలో 10 ఎంఎల్‌డి, జూన్ 2 న 12 ఎంఎల్‌డి, జూన్ 3న 27 ఎంఎల్‌డి, జూన్ 4న 42 ఎంఎల్‌డి, జూన్ 5న 20 ఎంఎల్‌డి, అదేవిధంగా మ్యాన్‌హోల్స్ విషయమై 43,574 మంజూరు చేయడమైనది. 1,40,000 హౌస్ కనెక్షన్లకు ఇది వర్తిస్తుంది. ఈ విధంగా డిజైన్ చేయడమైనది. వెట్టింగ్ విషయంలో ఐఐటి చెన్నై మరియు రూర్కీకి పంపించాము. వెట్టింగ్ కొన్ని వచ్చాయి, కొన్ని రాలేదు. దానిమీద ఆల్రెడీ పని మొదలుపెట్టాము. 192 కి.మీ. డిడబ్ల్యుసి పైప్‌లైన్స్‌ను సరఫరా చేశారు. 14 కి.మీ. లైన్

వేయడమైనది. 299 మ్యాన్ హోల్స్‌ను కన్‌స్ట్రక్ట్ చేశారు. ఈ విధంగా వర్క్ ప్రాసెస్‌లో ఉన్నది. ఇది మూడు సంవత్సరాల్లో పూర్తవుతుంది. 2019వ సంవత్సరానికి పని పూర్తయ్యేలా ఇది డిజైన్ చేయబడింది.

## పురపాలక పారిశుద్ధ్య పనివారల సమస్యలు

ప్రశ్న నెం. 9573 (103)

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు, ఎం.ఎల్‌సి

గౌరవనీయులైన పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్‌పై పని చేస్తున్న మునిసిపల్ స్కావెంజర్ల జిల్లా వారీ సంఖ్య ఎంత?
ఆ) ఔట్‌సోర్సింగ్ స్కావెంజర్లు ఇఎస్ఐ మరియు పిఎఫ్‌లను పొందే హక్కు కలిగివున్నారా?
ఇ) జి.ఓ.నెం. 279 ను రద్దు చేయాలని ఏదేని ఆందోళన చేయడమయిందా?
ఈ) అయితే, అందుకు సంబంధించి తీసుకున్న చర్య ఏమిటి?

గౌరవనీయులైన పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు :(శ్రీ పి. నారాయణ)

అ) ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికపై పనిచేస్తున్న స్కావెంజర్స్ ఎవరూ లేరు.
ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.
ఇ) అవునండీ.
ఈ) కార్మికుల ఆందోళనను దృష్టిలో ఉంచుకుంటూ, ఔట్‌సోర్సింగ్‌పై పనిచేస్తున్న కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడానికి జి.ఓ.ఎం.ఎస్.నెం. 279ని రూపొందిస్తూ, అవసరమైన జాగ్రత్తను తీసుకోవడమయింది. అవేవంటే, ఎంపికైన బిడ్డర్ సకాలంలో వేతనాలను చెల్లించడంతో పాటు ప్రస్తుతం ఉన్న సిబ్బంది కంటే అవసరం ఎక్కువగా ఉంటేనే తప్ప ప్రస్తుతమున్న సిబ్బంది నుండి కాకుండా ఇతర సిబ్బందిని నియమించరాదనే షరతులను నిబంధించడమయింది. అది రూల్. 3.35 పేజి.15లో చాలా క్లియర్‌గా ఉన్నది. వీటికితోడు సంబంధిత చట్టాలలోని నిబంధనల ప్రకారంగా ఇఎస్ఐ మరియు ఇపిఎఫ్ వంటి సామాజిక భద్రతా చర్యలు తప్పనిసరి చేయడమయింది. అది కూడా రూల్.3.36, పేజి. 19లో చాలా క్లియర్‌గా ఇవ్వడం జరిగింది.

ఉ.10.10

శ్రీ పి.జె.చంద్రశేఖర రావు (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, స్కావెంజర్స్ ఔట్‌సోర్సింగులో పనిచేస్తున్నారా అని నేను ప్రశ్న అడగడం జరిగింది. మున్సిపాలిటీలలో స్కావెంజర్లంతా కాంట్రాక్టు లేదా రెగ్యులర్ బేసిస్‌లో పనిచేస్తున్నారు. కొన్నిచోట్ల అవసరమైనపుడు ఔట్‌సోర్సింగు ద్వారా ఇతరులతో కూడా స్కావెంజర్ల పనిని చేయించడం జరుగుతోంది. మొత్తంమీద స్కావెంజర్లు ఔట్‌సోర్సింగు పద్ధతిలో ఉన్నా, కాంట్రాక్టు పద్ధతిలో ఉన్నా, రెగ్యులర్‌లో పనిచేస్తున్నా వారి వివరాలు దయచేసి మంత్రిగారు ఇవ్వవలసిన బాధ్యత ఉంది. సమాధానాలు పొదుపుగా కాక వివరంగా ఇస్తారని ఆశిస్తున్నాము.

రెండవది, ఔట్‌సోర్సింగు స్కావెంజర్లు ఇ.ఎస్.ఐ., పి.ఎఫ్. కలిగివున్నారా అని అంటే, అది ఉత్పన్నం కాదని చెప్పారు. ఇది జి.ఓ.నెం. 279 కు సంబంధించిన అంశం. ఈ జి.ఓ.నెం. 279 రాకముందు రాష్ట్రంలో

ఉన్న 115 కార్పోరేషన్లు, మునిసిపాలిటీలలో ఎవరైతే చనిపోయిన, పదవీవిరమణ పొందిన మునిసిపలు కార్మికులున్నారో వారిలో 99 శాతం మంది ఎస్సీలుంటారు. గతంలో వంశపారంపర్యపు హక్కులను కలిగివుండే సాంప్రదాయం వారిది. ఆ వంశపారంపర్యం సాంప్రదాయాన్ని తీసివేసిన నేపథ్యంలో వారికి ఈ పనులను పదవీవిరమణ లేదా చనిపోయినటువంటి మునిసిపలు కార్మికుల యొక్క పిల్లలకు లేదా వారిపై ఆధారపడినటువంటి వారికి గానీ, కాంట్రాక్టు తీసుకుంటే వారికే ఇస్తామనేటటువంటి పద్ధతుల్లో చట్టం ఉంది. ఇది అత్యంత వెనుకబడినటువంటి వారికి సంబంధించిన అంశం. నేను కోరేదేమంటే, జి.ఓ. నెం. 279 వచ్చిన తర్వాత వారికి వంశపారంపర్యంగా ఉండేటటువంటి హక్కులను తీసివేయడంతో పాటు వారినే తీసుకోవాలనే షరతు ఏదైతే ఉన్నదో వారికుండే కాంట్రాక్టును వారికే దక్కేటటువంటి హక్కును తీసివేయడం జరిగింది. దీనిని ప్రభుత్వం పరిశీలించి దానిని పునరుద్ధరించే దానికి చర్యలు చేపట్టాలని నేను తమరిద్వారా కోరుతున్నాను.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ( స్థానిక సంస్థలు – గుంటూరు): అధ్యక్షా, మునిసిపలు స్కావెంజర్ల కాంట్రాక్టర్లకు ఫలానా ప్రాంతంలో పరిశుభ్రం చేయాలని చెప్పడం జరుగుతోంది. ఆ స్కావెంజర్ల వేతనాల విషయంలో కనీస వేతన చట్టం ఎక్కడా అమలు కావడం లేదు. వారి కాంట్రాక్టరు ఇచ్చిన మొత్తాన్ని మాత్రమే వారు తీసుకుంటున్నారు. ఆ స్కావెంజర్లకు కనీస వేతనాలను అమలుచేస్తున్నారా, లేదా అనేది ఒకసారి వెరిఫై చేయవలసిందిగా కోరుతూ, దాని గురించి సమాధానం చెప్పవలసిందిగా నేను మంత్రిగారికి మనవిచేస్తున్నాను.

శ్రీ రాము సూర్యారావు (ఉపాధ్యాయ నియోజకవర్గం – తూర్పు, పశ్చిమ గోదావరి): అధ్యక్షా, ప్రతి మునిసిపాలిటీలో కార్మికులు నిత్యం అనేక సమస్యలను ఎదుర్కొంటూ, కొన్ని ఆందోళనలు కూడా చేస్తున్నారు. వారి సమస్యలు నిత్యం అలాగే ఉంటున్నాయి. వారు ఆందోళన చేసిన ప్రతిసారీ పట్టణాలలో చెత్త పేరుకుపోతోంది. దయచేసి మంత్రిగారు పారిశుధ్య కార్మికుల సమస్యలపై దృష్టిపెట్టి వాటిని పరిష్కరించాలని నేను కోరుతున్నాను.

డా. పి.నారాయణ: అధ్యక్షా, సెంట్రల్ యాక్టు, Prohibition of Employment as Manual Scavengers and their Rehabilitation Act, 2013 ప్రకారం స్కావెంజర్లనే పదం ఇప్పుడు లేదు. కేవలం పబ్లిక్ హెల్త్ వర్కర్లు అని పిలుస్తున్నాము. As per G.O.No. 279, Page No.18, Para No.3.35, it is clearly stated that "The contractors who win in the competitive bidding process will be required to engage those contract workers who are currently working in maintenance of sanitation and solid waste management activities. This will be a compulsory contractual condition for allotting contracts to the successful bidders who win the contracts on technical and financial consideration."

అధ్యక్షా, పి.ఎఫ్., ఇ.ఎస్.ఐ.కి సంబంధించి, "The Model RFP clearly specifies that the contract awardee will adopt all fair labour practices and regularly make payments of monthly wages and also will remit the statutory payments such as PF & ESI subscriptions on time and regularly. Releasing of contractor's payments will be subject to the condition that the contractor shows proof of payment of monthly wages and remittance of PF & ESI subscriptions for the previous months." అందువల్ల వారికి ఇ.ఎస్.ఐ. మరియు పి.ఎఫ్. రెండింటినీ కంపల్సరీ చేశాము. అదేవిధంగా, ఉన్న ఉద్యోగులెవరినీ తీసివేయకుండా వారందరినీ తీసుకోవాలని పెట్టడం జరిగింది. కనీస వేతనాలు చెల్లిస్తున్నారా, లేదా అని సభ్యులు అడిగారు. తప్పనిసరిగా కనీస వేతనాలు వారందరికీ ఇచ్చేవిధంగా చూడడం జరుగుతుంది.

# గ్రామీణ పేదరిక నిర్మూలన

ప్రశ్న నెం. 9447 (101)

గౌరవనీయులైన గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణం, పారిశుధ్య శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) సాంకేతికను వినియోగించుకుంటూ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో పేదరికాన్ని నిర్మూలించేందుకు ఏదైనా ప్రతిపాదన ఉన్నదా?

ఆ) అయితే ఆ వివరాలు ఏమిటి?

గౌరవనీయులైన గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణం, పారిశుధ్య శాఖ మంత్రివర్యులు: (శ్రీమతి కిమిడి మృణాళిని)

అ) అవునండీ.

ఆ) పేదరికం నిర్మూలన కోసం పేదలకు వివిధ సంక్షేమ కార్యక్రమాలు అందించేందుకు సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించడమయింది. ఎస్.హెచ్.జి. పొదుపులు మరియు రుణ పోర్టుఫోలియోకు వీలు కల్పించి, పర్యవేక్షించడం కోసం ఇంటర్ యాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐ.వి.ఆర్.ఎస్.) మరియు మొబైల్ బుక్ కీపింగ్‌ను ఉపయోగించడమయింది. ఎస్.హెచ్.జి. మహిళా సభ్యులు మొబైల్ బ్యాంకింగ్ వ్యాలెట్స్, ఏటిఎం / డెబిట్ కార్డులు, ప్లాస్టిక్ మనీ మొదలైనవి నిర్వహిస్తున్నారు. ఎన్.టి.ఆర్. భరోసా పింఛన్లను కూడా ఆధార్ అనుసంధాన ట్యాబ్లెట్ ఆధారిత వ్యవస్థ ద్వారా పంపిణీ చేయడమయింది.

మొదటిది, స్త్రీనిధి. సభ్యురాలెవరైనా, వారికి అత్యవసర పరిస్థితుల్లో రూ. 25 లు కావాలని వారికి అవసరముంటే, ఐ.వి.ఆర్.ఎస్. సిస్టమ్ ద్వారా స్త్రీ నిధికి 9951133555 అనే నెంబరుకు వారు ఫోన్ చేసి, ప్రతి సభ్యురాలికి ఉండే రెండు డిజిట్ల నెంబరును కీప్యాడ్‌లో ఎంటర్‌చేసి, అప్పు దేనికోసం వినియోగించుకుంటామనేది చెప్పాలి. విద్యకు గానీ, ఆరోగ్యానికి గానీ, వ్యాపారానికి గానీ, వీవింగ్ మొదలైనవాటి అవసరాల కోసం మహిళా సభ్యులకు రూ.25 వేలు ఇవ్వడం జరుగుతుంది. ఈ విధంగా, స్త్రీనిధి ఫోన్ నెంబరుకు సమాచారాన్ని ఎంటర్ చేసిన వెంటనే 48 గంటల్లో స్త్రీనిధి బ్యాంకు ద్వారా విలేజ్ ఆర్గనైజేషన్ సంఘానికి సొమ్మును ఇవ్వడం జరుగుతుంది. ఈ విధంగా ఇచ్చిన సొమ్మును చెక్కు ద్వారా ఆ సభ్యురాలికి ఆ సంఘం అందజేస్తుంది. ఎవరైతే విలేజ్ ఆర్గనైజేషన్లలో ఉంటారో వారు ప్రతినెల కూడా గ్రామస్థాయిలో ఒక మీటింగును ఏర్పాటు చేసుకుంటారు. ఎంతమంది సభ్యురాళ్లు ఆ సంఘంలో ఉన్నారు, ఎంతమంది హాజరైనారు, ఆ సభ్యులు ఎంత పొదుపు చేశారు, ఎంత మొత్తాన్ని అప్పుగా తీసుకున్నారనేది ఒక మొబైల్ యాప్ ద్వారా వారు ఎంటర్ చేస్తారు. ఈ మొబైల్ యాప్ అనేది 7 లక్షల మంది వి.ఏ.ఓ.లు ప్రతి నెలా ఎంటర్ చేసిన వివరాలకు సంబంధించిన సమాచారం సెంట్రల్ సర్వర్‌కు వస్తుంది. ఈ విధంగా ఆ నెలలో ఎంతమంది సభ్యురాళ్లుతో ఎన్ని విలేజ్

సంఘాలు గ్రామస్థాయిలో సమావేశాలను ఏర్పాటు చేసుకున్నాయనేది రాష్ట్ర స్థాయిలో తెలుస్తుంది.

ఉ.10.20

ఈ డ్వాక్రా మహిళా సంఘ సభ్యురాళ్ళకి మొబైల్ బుక్ కీపింగ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వంకానీ, సెర్ప్ ఆర్గనైజేషన్‌కానీ ట్రాన్సాక్షన్స్ చేయడం జరుగుతుంది.

మూడోది డిజిటల్ లిట్రసీ. ఈమధ్యకాలంలో డిజిటల్ లిట్రసీని గ్రామీణ ప్రాంతంలో ఉన్న మహిళలకు అందజేయడంలో మేము చాలా పెద్ద పాత్ర పోషిస్తున్నాము. గూగుల్, టాటా ట్రస్టుద్వారా 10,751 గ్రామాల్లో 4092మందికి మూడురోజులు అంతర్జాలంలో శిక్షణనివ్వడం జరిగింది. ఈ శిక్షణపొందిన ఒక్కొక్కరు గ్రామస్థాయిలోని దాదాపు 400 మంది సభ్యులకు శిక్షణనివ్వడం జరుగుతుంది. ఈ డిజిటల్ లిట్రసీలో మొత్తం 17,30,000 మందికి ట్యాబ్ ఎలా వాడాలి? యూట్యూబ్, ఇతరత్రా సాంకేతిక విజ్ఞానానికి సంబంధించిన అంశాలలో శిక్షణ ఇవ్వడం జరిగింది.

కేంద్రప్రభుత్వం డీమానిటైజేషన్‌ను ప్రకటించిన తరువాత చంద్రబాబునాయుడు గారి నేతృత్వంలోని ఈ ప్రభుత్వం పెద్ద ఎత్తున గ్రామీణ ప్రజలకు శిక్షణ ఇవ్వాలనే ఉద్దేశంతో 17,557 మొబైల్ బ్యాంకింగ్ ట్రైనర్స్ ద్వారా మొత్తం 11,41,253 మందికి శిక్షణ ఇచ్చారు. అందులో 6,46,751 మంది డ్వాక్రా సంఘ సభ్యురాళ్ళు, 3,00,038 మంది వ్యవసాయ కూలీలు, 1,10,662 మంది యువత, 83,802 మంది చిన్నవ్యాపారాలు చేసుకుంటున్నవారు ఉన్నారు. ఈ విధంగా 11,41,253 మందికి మొబైల్ బ్యాంకింగ్ వాడకం గురించిన శిక్షణనివ్వడం జరిగింది.

అదేవిధంగా గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు, ఎయిడ్స్ పేషంట్స్‌కు పెన్షన్‌లు ఇచ్చే సందర్భంలో ఎక్కడాకూడా అవినీతి జరగకుండా పారదర్శకంగా పెన్షన్ అందాలనే విధానంలో సాంకేతికతను వినియోగించి రాష్ట్రంలోని సుమారు 46 లక్షలమందికి బయోమెట్రిక్, ఐరిస్ విధానం, ఆఫ్‌లైన్ అథెంటికేషన్ ద్వారా పెన్షన్స్ ఇవ్వడం జరుగుతోంది. బయోమెట్రిక్‌ద్వారా 74 శాతం మందికి, ఐరిస్‌ద్వారా 13 శాతంమందికి, ఆఫ్‌లైన్ ద్వారా ఏడుశాతం మందికి, నెట్‌వర్క్ సమస్యలున్నచోట అథెంటికేషన్ ద్వారా ఇలా సాంకేతికతను ఉపయోగించి పెద్ద ఎత్తున పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతోంది. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు సాంకేతికతకు పెద్ద పీట వేసి ప్రభుత్వ పథకాలను గ్రామీణప్రజలకు అందచేస్తున్నారనే విషయాన్ని మీద్వారా సభకు, ఆంధ్రరాష్ట్ర ప్రజానీకానికి తెలియజేస్తున్నాను.

MR CHAIRMAN: Next question.

డాక్టర్ ఎం.వి.వి.ఎస్.మూర్తి (స్థానిక సంస్థలు – విశాఖపట్నం): అధ్యక్షా, అనుబంధ ప్రశ్నలేకుండానే మంత్రిగారు పదినిమిషాలు సమాధానం చెప్పారు. అడగడానికి నాకు రెండు నిమిషాలైనా సమయమివ్వాలి కదా. నేను వేసిన ప్రశ్నేమిటి? దానికి మంత్రిగారి సమాధానమేమిటి? నేను వేసిన ప్రశ్న చూడండి. "Whether there is any proposal to eradicate poverty in rural areas of the State, harnessing technology". సాంకేతికతను వినియోగించుకుంటూ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో పేదరికాన్ని నిర్మూలించేందుకు చర్యలేమిటని నేను అడిగాను. అయితే ఇందులో మనమెక్కడ ఉన్నాము. అకడమిక్ సమస్యలు అలానే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలోని యువతకు ఎక్కడా ఉద్యోగాలు రావడంలేదు. సాంకేతికత పరిజ్ఞానం ఎవరికీ తెలియదు. వారికి సరైన సదుపాయమే లేదు. అంతేగాకుండా విశ్వవిద్యాలయాలలో పరిశోధనలే లేవు. ఇంక సాంకేతిక ఎలా అందుతుంది?

ఉపాధిహామీ పథకంలో ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా ఉందన్నారు. అలాగే అందరికీ ఉపాధిని కల్పిస్తూ అన్నీ ఇస్తున్నామన్నారు. అయితే మీరు సాంకేతికతను ఎక్కడ ఉపయోగిస్తున్నారనేది చెప్పమన్నాము. గ్రామీణ ప్రజలకు రేషన్, పెన్షన్‌లు ఇవ్వడానికి మాత్రమే సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. But, how the technology is being given to the youth. నైపుణ్యం పెంపు బాధ్యత వెలుగు ప్రాజెక్టుకు అప్పజెప్పామని చెప్పారు. ఇంజనీరింగ్ కళాశాలలు పనికిరావంటున్నారు. రాష్ట్రంలోని ఇంజనీరింగ్ విద్యార్థుల్లో సమాచార నైపుణ్యాలు పెంచే బాధ్యతను ప్రైవేటు కళాశాలలు, సంస్థలకు అప్పగించడంకంటే వెలుగు ముఖ్య కార్యనిర్వహణాధికారి పర్యవేక్షణలోనే ఈ కార్యక్రమం అమలుకావడం మంచిదని భావిస్తున్నాం. ఏ గ్రామంలో ఎంతమంది యువతకి మీ ప్రోగ్రాములద్వారా శిక్షణనిచ్చారో కొంచెం దయచేసి చెప్తే బాగుంటుంది. మేము అడిగిన దానికి సమాధానం వేరుగా ఉంది. మీరు చెప్పిన సాంకేతికత ఏదైనా ఉంటే అది పట్టణ ప్రాంతాల్లోనే ఉంది తప్ప గ్రామీణ ప్రాంతానికి వెళ్ళలేదు. గ్రామీణ ప్రాంత యువతకు సంబంధించి నిరుద్యోగ సమస్య అలాగే ఉంది. వాళ్ళకి సాంకేతికత ఇవ్వడం కోసం మీరు తీసుకున్న చర్యలేమిటో చెప్పండి.

శ్రీ రాము సూర్యారావు: అధ్యక్షా, పట్టణ ప్రాంతాల్లో సాంకేతికత అమలుచేస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లో అమలుపరచడం లేదు. దయచేసి గ్రామీణ ప్రాంతాలమీద శ్రద్ధ వహించి ఈ చక్కని పథకాలను ఆ గ్రామీణ ప్రాంతాల పేదలకు అందేలా చూడమని మీద్వారా మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్: సాంకేతికత వాడకం పెరగాలి.

శ్రీమతి కిమిడి మృణాళిని: అధ్యక్షా, గౌరవ సభ్యులు మూర్తిగారు అడిగినటువంటి ప్రశ్నలో సాంకేతికతను వినియోగించుకుంటూ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో పేదరికాన్ని నిర్మూలించేందుకు ఏదైనా ప్రతిపాదన ఉన్నదా అన్నారు. ఇక్కడ యువత అనేది రాకపోవడంవల్ల గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన అంశంగా ఈ ప్రశ్న నా వద్దకు వచ్చింది.

డాక్టర్ ఎం.వి.వి.ఎస్ మూర్తి: అధ్యక్షా, సాంకేతికతను వినియోగించుకుని వాళ్ళ పేదరికాన్ని ఎలా పోగొడుతున్నారనేది చెప్పమన్నాము.

శ్రీమతి కిమిడి మృణాళిని: అధ్యక్షా, ఇప్పుడు యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు, పేదరిక నిర్మూలన కోసం వాళ్ళకు స్వయం ఉపాధి పథకాలను అందించడానికి ముందుగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను అందచేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రిగారు పెద్ద ఎత్తున ఆ కార్యక్రమాన్ని తీసుకోవడం జరుగుతుంది. అయితే స్కిల్ డెవలప్‌మెంట్ అనేది నా శాఖకు సంబంధించింది కాదు. గౌరవ మంత్రివర్యులు ఇప్పుడే ఇక్కడకు రావడం జరిగింది. వేరే ప్రశ్నద్వారా యువతకు సంబంధించిన స్కిల్ డెవలప్‌మెంట్ గురించి అడిగితే వారు సమాధానం ఇవ్వడం జరుగుతుంది.

డాక్టర్ ఎం.వి.వి.ఎస్ మూర్తి: మీరు ప్రశ్నను పంచుకుని సమాధానం చెప్పాలి.

శ్రీమతి కిమిడి మృణాళిని: అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగిన అంశాలను సంబంధిత మంత్రివర్యులకు తెలియజేసి వారిద్వారా సమాధానం పంపించడం జరుగుతుంది.

మిస్టర్ ఛైర్మన్: ఇది గ్రామీణ పేదరిక నిర్మూలనకు సంబంధించింది.

## బండిపల్లి బ్రాంచ్ కాలువ

ప్రశ్న నెం. 9636 (104)

శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన జల వనరుల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) బండేపల్లి బ్రాంచ్ కాలువ, సోమశిల ప్రాజెక్టు ఆయకట్టులోని చిట్ట చివరి ఆయకట్టు అయిన కనుపూర్ కాలువకు తగినంత నీటిని అందించలేకపోవడం వలన పంటలు ఎండిపోవడం జరిగిందా?

ఆ) అయితే, కండలేరు రిజర్వాయర్ నుండి డేగపూడి మీదుగా బండేపల్లి ఆయకట్టుకు నీటిని అందించే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా?

గౌరవనీయులైన జలవనరుల శాఖ మంత్రివర్యులు (శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు ):

అ) లేదండీ. సోమశిల రిజర్వాయర్‌లో తగినంత నీరు అందుబాటులో లేకపోవడం వలన 2016-17 సంవత్సరంలో (గత ఖరీఫ్) బండేపల్లి బ్రాంచ్ కాలువ క్రింద ఆయకట్టులో నాట్లు వేయడం జరగలేదు.

ఆ) అవునండీ, కండలేరు రిజర్వాయర్ నుండి డేగపూడి మీదుగా బండేపల్లి ఆయకట్టుకు నీటిని అందించే ప్రతిపాదన ఉన్నది.

శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి (నామినేటెడ్): అధ్యక్షా, 2016-17 సంవత్సరంలో మాత్రమే సోమశిలలో తగినంత నీరు లేనందువల్ల ఇవ్వలేకపోయామంటున్నారు. అయితే సోమశిలలో మిగులుజలాలు ఉన్నప్పుడుకూడా బండిపల్లి బ్రాంచ్ కెనాల్‌కు నీళ్ళు అందించినా ప్రతీ సంవత్సరం రెండు, మూడువేల ఎకరాలు ఎండిపోవడం, పది, పదిహేనువేల ఎకరాలకు నీటి సరఫరా ఇబ్బందులు పడడాన్ని గత కొన్ని సంవత్సరాలుగా చూస్తున్నాము. అందుకే బండేపల్లి ఆయకట్టుకింద ఉండే రైతులందరూ దాదాపు ఒకటిన్నర సంవత్సరం క్రితం మంత్రిగారిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. అయినా అదనపు జలాలేమీ లేవు. సోమశిల నుంచి పెన్నా నదీ జలాలు ఎక్కువ నష్టాలతో కనుపూర్ కాలువ సంగం బ్యారేజీ దగ్గరకు వస్తున్నాయి. అక్కడినుంచి ఇంకొక సుమారు 50కిలోమీటర్లు ప్రయాణించి బండేపల్లి దగ్గరకు పోతున్నాయి. మధ్యలో అదనపు ట్యాపింగ్ ఎక్కువ అయిపోయింది. ఆఖరుకి వాళ్ళకి చాలా తక్కువ నీళ్ళు వెళ్తోంది.

ఉ.10.30

అందుకని ప్రత్యామ్నాయంగా కండలేరు, డేగపూడి నుండి గొట్టపాలెం లింక్ కెనాల్ ఒకటి ప్రపోజ్ చేశారు. దానివలన తక్కువ నష్టాలతో రెండు మూడుసార్లు పంట తడికి నీళ్లు ఇస్తే దాదాపు 12 నుండి 15 వేల ఎకరాల పైరు కాపాడుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రపోజల్ వచ్చి దాదాపు సంవత్సరంన్నర అయ్యింది. ఈ రోజు మంత్రిగారు కూడా పాజిటివ్‌గా రెస్పాండ్ అయ్యారు. నేను వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. దానికి త్వరగా క్లియరెన్స్ ఇచ్చి టెండర్లు ఎప్పుడు పిలుస్తారని మీద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను.

శ్రీ కంతేటి సత్యనారాయణ రాజు(నామినేటెడ్): అధ్యక్షా, ఇరిగేషన్ మంత్రిగారు ఇక్కడ ఉన్నారు కాబట్టి నేను ఒక విషయం చెప్పదలచుకున్నాను. ఈ రోజు పోలవరం గురించి ప్రజెంటేషన్ చేస్తున్నారు కదా, అందులో పోలవరం ప్రాజెక్టుకు ఎప్పుడు ఫౌండేషన్ స్టోన్ వేశారన్నది కూడా ఆ పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో చూపించాలి. గత చరిత్రను ఎన్నడూ మరిచిపోకూడదు.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు: అధ్యక్షా, సభ్యులు శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గారు చెప్పినట్లు కన్‌పూర్ కాలువ చివరి ప్రాంతం అయినందువల్ల మధ్యలో ఆయకట్టు రైతాంగం మోటార్లు విరివిగా వాడడం వలన క్రింది ఆయకట్టుకు నీళ్లు అందని పరిస్థితి ఉంది. అంతేకాకుండా కన్‌పూర్ కాలువ చివరి భాగంలో ఉన్న రైతాంగం నీటి కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ప్రతిపాదన కూడా ప్రభుత్వం దగ్గర ఉన్నది. సదరు అంశమై అక్కడి రైతాంగం కూడా వచ్చి కలవడం జరిగింది. 113 కిలోమీటర్ల మేర చివరిదాకా నీళ్లు వెళ్లాలంటే ఇబ్బందికరమైన పరిస్థితి ఉంది. ఇదైతే కండలేరు దగ్గర ఆనకట్ట నిర్మాణం చేసుకుని, బండేపల్లి కాలువను తీసుకుని వెళ్లినట్లయితే 30 కిలోమీటర్లలోపే ఆయకట్టుకు నీటిని అందించేందుకు అవకాశం ఉంటుంది. కాబట్టి, టైటిల్ లాస్ క్లియరెన్స్ ప్రాసెస్‌లో ఉంది. త్వరితగతిన 2017వ సంవత్సరంలోనే ఈ పనులన్నీ పూర్తి చేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది.

## పిఎబిఆర్ ప్రాజెక్టు నుండి నీటి లీకేజీ

ప్రశ్న నెం. 9588(105)

శ్రీ పయ్యావుల కేశవ్, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన జల వనరుల నిర్వహణ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా?

అ) పి.ఏ.బి.ఆర్ ప్రాజెక్టు నుండి అధిక పరిమాణంలో నీరు కారిపోతున్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, సదరు లీకేజీని అరికట్టడానికి చేపట్టిన గ్రౌటింగ్ సఫలీకృతం అయిందా?

ఇ) లేనట్లయితే, జియా-మెంబ్రేన్ విధానం ద్వారా నీటి లీకేజీని నియంత్రించే ప్రతిపాదన ఏదైనా ఉందా?

గౌరవనీయులైన జల వనరుల నిర్వహణ శాఖ మంత్రి గారు (శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు):

అ) అవునండీ.

ఆ) ఇప్పటివరకు చేపట్టిన గ్రౌటింగ్ ద్వారా లీకేజీలను గణనీయంగా 39.4 సి/ఎస్ నుండి 2.72 సి/ఎస్‌కు తగ్గించడమయింది.

ఇ) అంతేగాక, నీటి లీకేజీని నియంత్రించేందుకు జియో-మెంబ్రేన్ విధానాన్ని ఉపయోగించే ప్రతిపాదన పరిశీలనలో ఉంది.

శ్రీ పయ్యావుల కేశవ్(స్థానిక సంస్థలు - అనంతపురం): అధ్యక్షా, అనంతపురం జిల్లాకు పి.ఏ.బి.ఆర్. ప్రాజెక్టు లైఫ్ లైన్. మొత్తం జిల్లాలో ఉన్న దాదాపు 2000 గ్రామాలకు త్రాగునీరు పి.ఏ.బి.ఆర్ ప్రాజెక్టు ద్వారానే అందుతుంది. సాగునీరుకు కూడా క్రూషియల్ లింక్. ఈ రిజర్వాయరు ద్వారా కడప, అనంతపురం జిల్లాలకు నీరు అందుతుంది. చాలా ప్రమాదకరమైన, భయంకరమైన స్థాయిలో ఆ రిజర్వాయరు నుండి లీకేజీలు ఉన్నాయి. గత పాలకుల నిర్లక్ష్యానికి, పాపానికి ప్రతిరూపంగా ఇవాళ

పి.ఏ.బి.ఆర్ ప్రాజెక్టు మన కళ్లముందు కనపడుతోంది. పి.ఏ.బి.ఆర్ ప్రాజెక్టు నుండి ఎగజిమ్మే నీరు మన కళ్లముందు కనపడుతోంది. పత్రికలలో పతాక స్థాయిలో దాని మీద ఎన్నో వార్తలు వచ్చాయి. రిజర్వాయరు మీద మొక్కలు మొలిచిన పరిస్థితి ఉంది. కాబట్టి, ఇప్పటికే గ్రౌటింగ్ చేశాము, ఆ విధంగా చేయడం వలన కొంత ఫలితం వచ్చిందని చెబుతున్నారు. కొంత ఫలితంతో సంతృప్తి చెందకూడదు. పూర్తి స్థాయిలో ఫలితాన్ని అందించేవరకూ, సంతృప్త స్థాయిలో దానిని గ్రౌటింగ్ చేయించాలని నేను మంత్రిగారిని కోరుతున్నాను. ఎందుకంటే, రిజర్వాయరు అడుగు భాగంలో ఇన్‌స్పెక్షన్ గ్యాలరీ ఉంది. అక్కడ ఏ అధికారి కూడా అడుగుపెట్టే పరిస్థితి లేదు. అడుగుపెడితే నడుంలోతు నీళ్లల్లో అడుగుపెట్టాలి. ఇది ప్రమాదకరమైన సంకేతం అనేది ఇప్పుడున్న టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. ఈ స్థాయిలో ఆ రిజర్వాయరుకు శరవేగంగా నష్టం చేకూరుతోంది కాబట్టి, దానిని వెంటనే గ్రౌటింగ్ చేయించాలి. 10 నెలల్లో పట్టిసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుని పూర్తి చేసిన ప్రభుత్వం ఇది. వారికి గ్రౌటింగ్ చేయడం అనేది చాలా చిన్న పని. నిర్దిష్ట కాలపరిమితి పెట్టి, ఆరు నెలల లోపల పి.ఏ.బి.ఆర్. ప్రాజెక్టు గ్రౌటింగ్‌ను పూర్తిచేసేలా చర్యలు తీసుకోమని మంత్రిగారిని మీ ద్వారా కోరుతున్నాను.

అలాగే రెండవ ప్రశ్న జియో-మెంబ్రేన్ టెక్నాలజీని ఉపయోగించే ప్రతిపాదన ఏదైనా ఉందా అని అడిగితే పరిశీలిస్తున్నామన్నారు. భారతదేశంలో మొదటిసారి కారంబరై రిజర్వాయరుకు జియో-మెంబ్రేన్ టెక్నాలజీని తమిళనాడులో 11 సంవత్సరాల క్రితం వాడారు. నిమిషానికి 40,000 లీటర్ల లీకేజీ ఉన్నచోట జియో-మెంబ్రేన్ టెక్నాలజీని ఉపయోగించిన తరువాత లీకేజీ నిమిషానికి 40 లీటర్లకు పడిపోయింది. 11 సంవత్సరాల తరువాత ఈ రోజు చూసుకున్నా లీకేజీ నిమిషానికి 60, 70 లీటర్లకు మించలేదు. కాబట్టి, ఆ టెక్నాలజీని కూడా మీరు వినియోగించండని ప్రభుత్వాన్ని కోరుతున్నాము. తమిళనాడులో మూడు రిజర్వాయర్లలో ఆ టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. మన అధికారులను పంపించండి, ఒకవైపు గ్రౌటింగ్ పూర్తి చేయండి. రెండోవైపు జియో-మెంబ్రేన్ టెక్నాలజీని ఉపయోగించండి. ఎందుకంటే కరవు సీమలో అలాంటి టెక్నాలజీని వాడి ప్రతీ నీటి చుక్కను సద్వినియోగం చేయాలని మీ ద్వారా నేను మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీమతి పమిడి శమంతకమణి(శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, అనంతపురం జిల్లాలో పి.ఏ.బి.ఆర్ ప్రాజెక్టు ఎలా ఉందో మిడ్‌పెన్నార్ రిజర్వాయర్ కూడా అలాగే ఉంది. మొదట తుంగభద్ర నీళ్లు మిడ్‌పెన్నార్ రిజర్వాయర్‌కు వస్తాయి. అక్కడి నుండి 28 డిస్ట్రిబ్యూటరీ ఛానెల్స్ కలిగిన అతిపెద్ద హెచ్.ఎల్.సి. కెనాల్ నుంచే వుంటుంది. కానీ, హెచ్.ఎల్.సి కెనాల్‌కు ఉన్న లీకేజ్ వలన దాదాపు 4, 5 డిస్ట్రిబ్యూటరీ చానెల్స్‌కు రావాల్సిన నీళ్లు లీకేజ్ అవుతున్నాయి. దయచేసి, దానిమీద ఏం శ్రద్ధ తీసుకుంటున్నారో తెలపాల్సిందిగా మీద్వారా మంత్రివర్యులను అడుగుతున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు: అధ్యక్షా, పి.ఏ.బి.ఆర్. డ్యాం అనంతపురం జిల్లాకు గుండెకాయ వంటిది. ఎందుకంటే హెచ్.ఎల్.సి. నుండి గానీ, హంద్రీనీవా నుండి గానీ, జీడిపల్లి రిజర్వాయరు నుండి పి.ఏ.బి.ఆర్‌లో నీళ్లు పెట్టుకుంటే అనంతపురం జిల్లాకు త్రాగునీరే కాదు, సాగునీటికి కూడా శాశ్వత పరిష్కారం దొరికే అతిమంచి పెద్ద ప్రాజెక్టు. మహానుభావుడు డా.శివరామ కృష్ణయ్య గారి పేరుమీద ఈ డ్యాం ఉంది. గ్రౌటింగ్ పనులకు దాదాపు రూ.8.66 కోట్లు ఖర్చుపెట్టాము. మిగిలిన బ్యాలెన్స్ రూ.3.74 కోట్ల గ్రౌటింగ్ పనులు త్వరితగతిన చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాము. అంతేగాకుండా, పర్మినెంట్‌గా భవిష్యత్తులో జియో మెంబ్రేన్ టెక్నాలజీ ఉపయోగించాలని గౌరవ సభ్యులు అడుగుతున్నారు. అదికూడా ప్రభుత్వ పరిశీలనలో ఉంది. తమిళనాడులో కొన్ని ప్రాజెక్టులలో ఆ టెక్నాలజీ విజయవంతమైంది. తప్పకుండా దానిని కూడా పరిగణనలోకి తీసుకుని శాశ్వత పరిష్కారంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా

పి.ఏ.బి.ఆర్. క్రింద ఆయకట్టుకు త్రాగునీరు, సాగునీరు ఇవ్వడంతోబాటు, పరిశ్రమలకు కావాల్సిన నీటిని అందించడానికి కూడా ఈ డ్యాం బ్రహ్మాండంగా ఉపయోగపడుతుంది.

అంతేకాకుండా గౌరవసభ్యురాలు శ్రీమతి పమిడి శమంతకమణి గారు మిడ్‌పెన్నార్ గురించి చెప్పారు. హెచ్.ఎల్.సి. క్రింద నీళ్లు వచ్చే విధంగా తప్పకుండా ఆ పనులన్నీ పూర్తిచేసే బాధ్యత తీసుకుంటామని మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీ పయ్యావుల కేశవ్: అధ్యక్షా, మంత్రిగారు చేస్తున్న పనులలో రూ.3 కోట్లు మిగిలాయి, ఆ పనులు పూర్తిచేస్తాము అని చెబుతున్నారు. కానీ, చేయాల్సిన పనులు దాదాపు రూ.10 కోట్ల వరకూ ఉన్నాయి. అందువల్ల, అధికారులను పంపించి మా రిజర్వాయరును సురక్షితమైన స్థాయిలో చేయడానికి ఏ ఏ పనులు అవసరమో, ఆ పనులన్నీ చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని ఈ సభ ద్వారా హామీ ఇవ్వమని కోరుతున్నాము.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు: అధ్యక్షా, నాకు తెలిసి గత రెండు, మూడు దశాబ్దాల్లో ఏ మంత్రి కూడా ఆ డ్యాం దగ్గరకు వెళ్లలేదు. నేనే వెళ్లి ఆ పనులు చేయించాను. మరలా ఏప్రిల్‌లో వెళ్లి ప్రత్యక్షంగా చూసి, అక్కడ ఎన్ని కోట్ల పనులైనా పూర్తి చేసేలా ఈ ప్రభుత్వం అనంతపురం జిల్లాకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. అసలే తక్కువ వర్షపాతం నమోదయ్యే జిల్లా. గుండెకాయ లాంటి జిల్లా. తప్పకుండా రాయలసీమలోని ఇతర జిల్లాలతోబాటు, అనంతపురం జిల్లాకు అత్యంత ప్రాధాన్యత ఇస్తాము. ఎన్ని కోట్లు ఖర్చయినా ఈ ప్రభుత్వం వెనుకాడే ప్రసక్తే లేదు. తప్పకుండా పనిచేస్తాము.

## క్రైం రేటు పెరుగుదల

ప్రశ్న నెం. 9597(106)

సర్వ శ్రీ దేవసాని చిన్న గోవింద రెడ్డి, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎం.ఎల్.సి.లు.,

గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రిగారు (హోం వ్యవహారాలు) దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో నేరాల రేటు పెరుగుదలకు సంబంధించి ఇటీవల ఎన్‌సిఆర్‌బి నివేదికలో ఏదేని అంశాన్ని ప్రస్తావించడమయిందా?

ఆ) అయితే, అందుకు సంబంధించిన వివరాలేమిటి?

ఇ) రాష్ట్రంలో నేరాల రేటు పెరగటానికి గల కారణాలేమిటి?

గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి గారు (హోం వ్యవహారాలు) (శ్రీ నిమ్మకాయల చినరాజప్ప):

అ) లేదండీ

ఆ) & ఇ) ఈ ప్రశ్నలు ఉత్పన్నం కావు.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు: అధ్యక్షా, మంత్రిగారి సమాధానం చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉంది. ఏవిధంగా మొదటి ప్రశ్నకు లేదండీ అని, బి మరియు సి ప్రశ్నలకు ఉత్పన్నం కాదని అన్నారో అర్థం కావడం లేదు. ప్రస్తుతం క్రైం రేటు అనేది బాగా పెరుగుతూ ఉంది. ప్రస్తుతం సైబర్ నేరాలు బాగా పెరుగుతున్నాయి. మనకున్న క్రైంలలో హౌస్ బ్రేకింగ్, దొంగతనాలు, డెకాయిట్స్, కిడ్నాప్‌లు, మర్డర్స్ మొదలైనవే కాకుండా

తాజాగా డ్యాష్‌బోర్డు సమాచారం ప్రకారం, 2015వ సంవత్సరంలో 84,332 క్రైంలు, 2016వ సంవత్సరంలో మూడు నెలల క్రితం వరకూ 81,276 క్రైంలు, ప్రస్తుతం ఆ సంఖ్య 90,000 దాటినట్లు సమాచారం ఉంది.

ఉ.10.40

అధ్యక్షా, ఇవి గాక మనకు ఉన్న కారణాలేమిటని చూస్తే, ఒకపక్క సైబర్ క్రైమ్‌లు విపరీతంగా పెరిగిపోతుంటే, సైబర్ క్రైమ్‌లను దర్యాప్తు చేయడానికి మనకు ట్రెయిన్డ్ మ్యాన్ పవర్ లేదని ప్రభుత్వం ఒప్పుకుంది. మీరు దయచేసి డ్యాష్ బోర్డులో చూడండి. ఇటీవల అనేక రిపోర్టులు వచ్చాయి. మన దగ్గర సైబర్ క్రైమ్ పెరిగిపోతోంది. In the year 2016, it was recorded highest number of cases, when compared to the last four years. అయితే 1080 సైబర్ కేసులు నమోదు కాగా, ఒక్క విశాఖపట్నం ప్రాంతంలోదర్యాప్తు చేసి, ఛార్జ్‌షీటు ఫైల్‌చేసింది కేవలం 120 కేసులు. అంటే 15%. దీనికి ప్రధాన కారణాలేమంటే, ట్రెయిన్డ్ మ్యాన్ పవర్ గానీ, సైబర్ మిటిగేషన్ స్కీములు గానీ సక్రమంగా లేవు. దానికి మీరు చాలా సింపుల్‌గా అసలు ఈ ప్రశ్నే ఉత్పన్నం కాదు అని, అటువంటిదేమీ లేదు అని చెప్పడం చాలా వాస్తవ విరుద్ధం. ఇంకొక ఆశ్చర్యకరమైందేమంటే, the crime rate in Andhra Pradesh is increasing on SCs and STs. ఇది రిపోర్టులోనే ఉంది. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఎస్సీ, ఎస్టీల మీద జరిగే దాడులలో మన ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానంలో, ఆ తరువాతి స్థానంలో రాజస్థాన్ ఉంది. Andhra Pradesh stands second place in attacks on SCs. ఎస్టీల మీద జరిగే దాడులలో ఆంధ్రప్రదేశ్ మూడవ స్థానంలో ఉంది. మొదటి స్థానంలో కేరళ, రెండవ స్థానంలో రాజస్థాన్, మూడవ స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే, క్రైము రేటు పెరుగుతూ ఉంటే, ఎస్సీ, ఎస్టీల మీద, మహిళల మీద దాడులు, అత్యాచారాలు పెరుగుతూ ఉంటే, ఎక్కడా లేవని సమాధానం ఇవ్వడం సరైనది కాదు. ఎందుకు ఈ విధమైన ఉదాసీన వైఖరిని ప్రభుత్వం ప్రదర్శిస్తోంది, దీనిని తగ్గించడానికి ప్రభుత్వం తీసుకోబోయే చర్యలేమిటో వివరంగా చెప్పవలసిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు (ఉపాధ్యాయ నియోజకవర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం): అధ్యక్షా, కళాశాలలలోనూ, ప్రత్యేకించి విశ్వవిద్యాలయాలలోనూ, కొన్ని అసాంఘిక శక్తులు ప్రవేశించి, విద్యార్థుల భవిష్యత్తును పాడుచేస్తున్నాయి. వాటిని నియంత్రించడం కోసం పాఠశాల స్థాయి నుంచి ఎన్.సి.సి యూనిట్లను మనం ప్రోత్సహించినట్లైతే సెల్ఫ్‌డిసిప్లైన్ రావడం వల్ల, ఈ అసాంఘిక శక్తులను అడ్డుకునే నైతిక శక్తి రావడం జరిగి ఈ దాడులను నిరోధించవచ్చు. కాబట్టి, అలాంటి ఉద్దేశమేమైనా ప్రభుత్వానికి ఉన్నదా? అని నేను ఉపముఖ్యమంత్రిగారిని అడుగుతున్నాను.

శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, మన రాష్ట్రంలో మహిళల మీద జరుగుతున్నటువంటి దాడులు ఎక్కువ శాతంగానే ఉన్నాయి. దానిమీద తీసుకున్న చర్యలేమిటో చెప్పవలసిందిగా కోరుతున్నాను. అదేవిధంగా, ఒకటిన్నర, రెండు సంవత్సరాల వయసు గల పిల్లల నుండి పెద్దల వరకు, ఎవరైనా మహిళలు ఒక్కరే బయటికి వెళ్లడానికి భయపడుతున్నారు. ఇటువంటివి ఈ మధ్య కాలంలో మీరు పేపర్లో కూడా చూసి ఉంటారు. చిన్న పిల్లలను కూడా అత్యాచారం చేసే దుర్మార్గమైన పరిస్థితిలో మనం ఉన్నాము కాబట్టి వాటి మీద ప్రత్యేకమైన చట్టాలు చేయగలిగే విధంగా ఆలోచించమని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ ఎస్. చినరాజప్ప: అధ్యక్షా, ఈ రాష్ట్రంలో క్రైమ్ రేటు తగ్గిందని తెలియజేస్తున్నాను. ఎందుకంటే ముఖ్యమంత్రి గారు కొత్తగా ఏర్పడిన రాష్ట్రం కాబట్టి మన రాష్ట్రం అభివృద్ధి చెందాలి, ఈ రాష్ట్రంలో ప్రాజెక్టులు పెరగాలి, పరిశ్రమలు రావాలి, మనం రాజధాని కట్టుకోవాలనే ఉద్దేశంతో క్రైమ్ రేటుని తగ్గించాలనే

ప్రయత్నంతో, రైట్‌మేన్‌ని రైట్‌ప్లేస్‌లో పెట్టడం ద్వారా ఈ రాష్ట్రంలో క్రైమ్ రేటు తగ్గిందని తెలియజేస్తున్నాను. మన రాష్ట్రంలో 2014వ సంవత్సరంలో 1,07,796 క్రైమ్‌లు జరిగాయి. 2015వ సంవత్సరంలో, 1,03,573 జరిగాయి, 2016వ సంవత్సరంలో 1,883 జరిగాయి. అంటే 2014 నుంచి 2015వ సంవత్సరం వరకు క్రైమ్ రేటు యొక్క పర్సెంటేజి చూస్తే –3.92%, 2015 నుంచి 2016వ సంవత్సరానికి –1.62% మేరకు తగ్గాయి. ఈ ఏడాది సమాజానికి అనుగుణంగా, నేరాలలో కూడా మార్పులు వచ్చాయి. సైబర్ క్రైమ్‌ని అదుపు చేయడానికి చట్టాలలో మార్పులు చేసి, దానిని తగ్గించే ప్రయత్నమై మన ముఖ్యమంత్రిగారు ఎప్పటికప్పుడు ఆలోచించడం జరిగింది.

అలాగే మన రాష్ట్రంలో ఎస్సీల మీద దాడులు తగ్గడం జరిగింది. ఎందుకంటే గత ప్రభుత్వం ఎస్సీల మీద వచ్చే కేసులను నమోదు చేసేది కాదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి కేసునూ రికార్డు చేయమని, ఎంక్వైరీ చేయమని చెప్పడం జరిగింది. ఆవిధంగా చూసుకున్నా కూడా మనకు వచ్చే కేసులు తగ్గుముఖం పట్టాయి. అలాగే మహిళలకు సంబంధించిన కేసులను కూడా మేము సీరియస్‌గా తీసుకుని, కొన్ని యాప్‌లను పెట్టి, అవి ఎప్పటికప్పుడు మహిళలకు తెలిసేలా చేయమన్నాము, అలాగే నేరాలు చేసిన వారికి శిక్షలు పడేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాము. ఈ క్రైమ్ రేటుని కంట్రోల్ చేసే దిశగా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతోందని సభ్యులకు మీ ద్వారా తెలియజేస్తున్నాను.

## ఎస్.సి., ఎస్.టి. ఉప ప్రణాళిక క్రింద క్రొత్త పథకాలు

ప్రశ్న నెం.9623(107)
శ్రీమతి పి. శమంతకమణి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన సాంఘిక సంక్షేమం & సాధికారత మరియు గిరిజన సంక్షేమం & సాధికారత శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) ఎస్.సి మరియు ఎస్.టి సబ్‌ప్లాన్ క్రింద కొత్త పథకాలను గుర్తించడానికి ప్రజలు మరియు స్వచ్ఛంద సంస్థలకు ప్రమేయం కల్పిస్తూ ఏవేని కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందా?

ఆ) అయితే, ఆ వివరాలేమిటి?

గౌరవనీయులైన సాంఘిక సంక్షేమం మరియు సాధికారత మరియు గిరిజన సంక్షేమం మరియు సాధికారత శాఖ మంత్రివర్యులు (శ్రీ రావెల కిషోర్ బాబు):

అ) లేదండీ.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీమతి పమిడి శమంతకమణి: అధ్యక్షా, ప్రతిసారీ నా ప్రశ్నకు లేదండి, ఉత్పన్నం కాదు అని అంటున్నారు. జిల్లాల వారీగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను మీరు పంపించడం జరుగుతోంది. దానిని నియోజకవర్గాల వారీగా పంపడానికి మీరేమైనా ప్రణాళికలు వేసుకున్నారా? రెండవది, మానిటరింగ్ కమిటీలు వేస్తున్నారు, ఈ కమిటీలలో ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల భాగస్వామ్యం ఏమైనా ఉందా? మూడోది, పాత సంప్రదాయం కాకుండా, కొత్త సంప్రదాయంగా నూతన పథకాలు ఏమైనా అమలు చేయడానికి ఆలోచిస్తున్నారా అని నేను మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

అధ్యక్షా, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాను నిధులతో ఎక్కడైనా బ్రిడ్జీలు గానీ, causeway గానీ, రోడ్లు గానీ వేసేటప్పుడు వాటిమీద సబ్‌ప్లాను నిధులతో వేస్తున్నట్లుగా మనకు తెలియడానికి శిలాఫలకం మీద

రాయడం లాంటి ప్రతిపాదనలేమైనా ఉన్నాయా? గతంలో ఎస్సీ , ఎస్టీ సబ్‌ప్లాన్‌తో ఎస్సీ, ఎస్టీ ప్రాంతాలలో పనులు జరిగేవి, కానీ ఇప్పుడు మన ప్రభుత్వం వచ్చిన తరువాత ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు పెట్టడంలో బాగా పారదర్శకత కనిపిస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు ఈ YTC బిల్డింగులలో ట్రైనింగ్ ఇవ్వడం వల్ల వాళ్లకు కొన్ని ప్రైవేటు జాబులు వస్తున్నాయి. కానీ, వాటిని ఇంకా మెరుగుపరచడానికి ఏవైనా చర్యలు తీసుకుంటున్నారా అని తమ ద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను.

శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి: అధ్యక్షా, కొన్ని ఐసోలేటెడ్‌గా ఎస్సీ జనాభా ఉండే గ్రామాలు ఉన్నాయి. వాటికి వరదలు వచ్చినపుడు కమ్యూనికేషన్ జరపడానికి ఇబ్బంది వస్తోంది. ఉదాహరణకు, నెల్లూరు జిల్లాలో వెంకటాచలం మండలం, తిరుమలంపాడు గ్రామం ఉంది. దానిమీద లోలెవల్ క్రాస్ బ్రిడ్జిలు ఉన్నాయి, హైలెవల్ బ్రిడ్జి కట్టాలి. క్రిందటి సంవత్సరం వరదలు వచ్చినప్పుడు 15 రోజులు అక్కడి నుండి రాకపోకలు నిలిచిపోయాయి. పడవలలో వెళ్లి భోజనం ప్యాకెట్లు సప్లై చేయాల్సి వచ్చింది. అక్కడ హైలెవల్ బ్రిడ్జి ఒకటి ఐదుకోట్ల నలభై లక్షల రూపాయలతో ప్రతిపాదనలో ఉంది. ఇటువంటివన్నీ ఎస్సీ సబ్‌ప్లాన్‌లో పెట్టుకుని ప్రత్యేకంగా ఎస్సీ కాలనీలు, గ్రామాలను గుర్తించాల్సిన అవసరం ఉంది. కాబట్టి, ఈ తిరుమలం పాడు బ్రిడ్జి విషయం మంత్రిగారి దృష్టికి వచ్చిందా అనేది తెలియజేయవలసిందిగా మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ రాము సూర్యారావు: అధ్యక్షా, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులకు సంబంధించి దళిత సంఘాలు, ప్రజా సంఘాలు చాలా ఉద్యమాలు చేశాయి. దయచేసి మంత్రిగారు దీనిని అమలు పరిచే విషయంలో వాళ్లందర్నీ భాగస్వాముల్ని చేస్తే ఇంకా ఎఫెక్టివ్‌గా పనిచేస్తాయి, వాళ్లు కూడా సేవలు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. మంత్రిగారు సబ్‌ప్లాన్ నిధులు విషయంలో కృషి చేశారు కాబట్టి, ఆయా సంఘాలను కూడా భాగస్వాముల్ని చేయాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

ఉ. 10.50

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు: అధ్యక్షా, ఇప్పుడు మన బడ్జెట్‌లో సబ్ ప్లాన్‌కు సంబంధించి ప్లాన్, నాన్ ప్లానుల హెడ్డింగులు తీసేసిన నేపథ్యంలో సబ్‌ప్లాన్ అనేటటువంటి సబ్జెక్టుకు రిలవెన్సుగానీ, జనాభా ప్రాతిపదకన ఖచ్చితమైన బడ్జెట్ కేటాయింపులు గానీ ప్రశ్నార్థకమయ్యాయి. ఈ నేపథ్యంలో 2013లో వచ్చిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టంలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన వెసులుబాటు గురించి అందులో పొందుపరచడం జరిగింది. 2013 చట్టాన్ని సవరిస్తూ, సబ్‌ప్లాన్ నిధులను సవరించడం కోసం తెలంగాణ రాష్ట్రంలో ఈ చట్టాన్ని సవరించడం జరిగింది. ఆ దిశగా మన రాష్ట్రం కూడా దీని గురించి ఆలోచించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. అలాగే, ఈ సబ్‌ప్లాన్ నిధులను కేటాయించిన సంవత్సరంలో కనుక ఖర్చు కాకపోయినట్లయితే, వాటిని రాబోయే సంవత్సరానికి క్యారీఫార్వర్డ్ చేయవలసిన అవసరం ఉన్నది. అయితే, అది మన చట్టంలో ఎక్కడా లేదు. 2013వ సంవత్సరంలోనే ఆ చట్టాల నిర్మాణం జరిగినప్పుడు దానిని కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. కానీ, తెలంగాణ రాష్ట్రంలో ఈ చట్టం ద్వారా చేసిన మార్పుల్లో దాన్ని క్యారీఫార్వర్డ్ చేసి తీసుకుని రావడమే కాకుండా, దానిని ఆమోదించడం కూడా జరిగింది. మన రాష్ట్రంలో ఇవేమీ జరగకుండా, ఈ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు సంబంధించి ఏ విధమైన బేస్ లేకుండా పోతోంది. 2013వ సంవత్సరపు చట్టం యొక్క స్పిరిట్ ఏదైతే ఉందో, అది నిర్వీర్యమైపోతున్న పరిస్థితి ఉన్నది.

అధ్యక్షా, చివరగా ఒక మాట. ఇప్పుడు మొత్తం వచ్చిన 3 ప్రశ్నలలో కూడా 'No Sir. Does not arise Sir.' అని ఉన్నాయి. ఏంటి సార్, ఇవేమన్నా టెక్నికలా? ప్రభుత్వం దీనిని సీరియస్‌గా తీసుకోవాలని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ రావెల కిషోర్ బాబు: అధ్యక్షా, 2013వ సంవత్సరం నుంచి అమలులోకి వచ్చిన ఈ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం ఏదైతే ఉందో, అది మన భారతదేశంలో మొట్టమొదటగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచే మొదలయ్యింది. ఆ తరువాత, ఒక సంవత్సరం తరువాత ఈ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని కర్ణాటక రాష్ట్రం తీసుకువచ్చింది. భారతదేశంలో ఈ రెండు రాష్ట్రాలు మాత్రమే ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని అమలు చేస్తున్నాయి. మా మ్యానిఫెస్టోలో చెప్పినట్లుగా మరియు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టంలో పొందుపరచినట్లుగా అన్ని అంశాలను చిత్తశుద్ధితో అమలు చేస్తామని చెప్పినట్లుగానే ఈ ప్రభుత్వం వాటిని అమలుచేస్తోంది.

అధ్యక్షా, గౌరవ సభ్యురాలు శ్రీమతి పమిడి శమంతకమణి గారు చెప్పినట్లుగా ఈ నూతన పథకాలను రూపొందించే క్రమంలో ప్రజా సంఘాలను కానీ, దళిత సంఘాలను కానీ, స్వచ్ఛంద సంస్థలను కానీ ఇన్‌వాల్వ్ చేస్తున్నారా అని అడిగారు. చాలా నూతన పథకాలను ఈ ప్రభుత్వం రూపొందించి, అమలుచేస్తోంది. వాటిల్లో కొన్ని ముఖ్యమైన అంశాలను తమ ద్వారా గౌరవ సభ్యులకు, ప్రజలకు తెలియజేయాలని అనుకుంటున్నాను. మొదటిది విదేశీ విద్యకోసం 'అంబేద్కర్ ఓవర్‌సీస్ విద్యార్థి పథకాన్ని' తీసుకువచ్చాము. ఐఏఎస్, ఐపిఎస్ కోచింగుకు సంబంధించి ఎన్‌టిఆర్ విద్యోన్నతి పథకాన్ని తీసుకువచ్చాము. అలాగే, ఈ రోజున 175 నియోజక వర్గాలలో గతంలో మున్నెన్నడూ లేని విధంగా గ్రామాలలో కానీ, పట్టణాలలో కానీ, రూ.2,000 కోట్ల నిధులతో ఈ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో అంతర్గత అప్రోచ్ రోడ్లు వేయడమనేది చారిత్రాత్మకమైన అంశం. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత పెద్దఎత్తున ఈ ఉపప్రణాళిక నిధులను కేటాయించినటువంటి సందర్భాలు ఎక్కడా లేవు. మొట్టమొదటిసారిగా రూ.2,000 కోట్లతో ఈ అంతర్గత అప్రోచ్ రోడ్లను వేశాము. దీనికి గౌరవ సభ్యురాలు శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి గారు కూడా ఒక ప్రశ్న వేశారు. రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు, కాజ్‌వేలను ప్రభుత్వం నిర్మిస్తున్నప్పుడు ఆ నిర్మాణానికి ఉపయోగించే సొమ్ము ఉప ప్రణాళిక క్రింద ఖర్చుపెడుతున్నదనే విషయం ప్రజలకు తెలియవలసిన అవసరం ఉందని చెప్పారు. అంతేగాకుండా, ఈ శిలాఫలకాలపైన కూడా శాశ్వతంగా ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక నిధులతో అని వేయడమే కాకుండా, స్థానికంగా ప్రజలచేత ఎన్నుకోబడిన ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులు ఎవరైతే ఉన్నారో, వారిని కూడా ఆయా అంశాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ సమయంలో ఇన్‌వాల్వ్ చేయమని ఒక సర్క్యులరును ఇచ్చాము. ఈ రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు మొదలైనవి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో చేస్తున్నామనేవి ప్రజలకు తెలిసేవిధంగా, విజిబులిటీ వచ్చే విధంగా అన్ని చర్యలూ తీసుకుంటున్నాము.

అధ్యక్షా, అదేవిధంగా YTCలకి (Youth Training Centres) సంబంధించి 13 జిల్లాలలో దాదాపుగా 7 లక్షల ఎస్ఎఫ్‌టి కలిగిన 28 భవనాలు ఉన్నాయి. ఈ భవనాలను స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ఎం.ఓ.యు చేసి ఇవ్వడం జరిగింది. ఈ భవనాలలో నిరంతరం స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు జరుగుతూనే ఉన్నాయి. గౌరవ సభ్యులు ఇందులో జరిగే కార్యక్రమాలను ఇంకా ఉధృతం చేసి, ఆ విద్యార్థులను మరింత ముందుకు తీసుకువెళ్ళి, ఆ సంఖ్యను పెంచమని అడిగారు. తప్పకుండా ఆ సంఖ్యను పెంచుతాము.

అదేవిధంగా, గిరిజన ప్రాంతాలలో ముఖ్యంగా రెండు పథకాలను తీసుకున్నాము. బహుశా భారతదేశంలో ఈ రెండు పథకాలు ఎక్కడా అమల్లో లేవు. కాంట్రాక్టర్ల డెవలప్‌మెంట్ ప్రోగ్రాం క్రింద బిటెక్, సివిల్ డిప్లొమో పూర్తి చేసిన సుమారు 45 మంది నిరుద్యోగ గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు ఈ కార్యక్రమం క్రింద శిక్షణ ఇచ్చి, కాంట్రాక్టర్లుగా నిలబెడుతున్నాము. అంటే, వారు కేవలం ఉద్యోగాల మీదే ఆధారపడకుండా వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు ఆధారపడుతూ, కాంట్రాక్టర్లుగా అభివృద్ధి చెందాలని ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది. అలాగే, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల శిక్షణ క్రింద కూడా ఎస్సీ, ఎస్టీ డిపార్టుమెంట్ల నుంచి చదువుకున్న యువతీయువకులను కేవలం ఉద్యోగాల మీదే ఆధారపడకుండా

పరిశ్రమలను నెలకొల్పేందుకు ప్రభుత్వం కూడా తగిన ప్రోత్సాహం ఇస్తుందని చెప్పి, వారిని ప్రోత్సహిస్తున్నాము.

అధ్యక్షా, అదేవిధంగా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ప్రవేశపెట్టిన నూతన పథకాలలో ఉచిత విద్యుత్తును కూడా దాదాపు 75 యూనిట్ల వరకు పెంచిన విషయం అందరికీ తెలిసిందే. అలాగే, హెల్త్ డిపార్టుమెంట్లో 'బేబీకిట్స్' అని అప్పుడే పుట్టిన ఎస్సీ, ఎస్టీ పిల్లలకు ఈ కిట్స్‌ను కూడా ఇస్తున్నాము. ఇది క్రొత్త పథకం. ఎస్టీలలో ముఖ్యంగా చిన్నపిల్లల్లో పౌష్టికాహార లోపం ద్వారా చాలా జబ్బులు వస్తున్నాయని, 'గిరి గోరుముద్దల పథకం' ద్వారా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల నుంచి తీసుకువచ్చిన క్రొత్త పథకం ద్వారా ఆ పిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నాము. అలాగే, 'గిరిపుత్రిక' అనే క్రొత్త కళ్యాణ పథకం ద్వారా దాదాపు రూ.50,000ల నగదును ఎస్టీ గిరిజన ఆడ పిల్లలకు వివాహ ఖర్చుల నిమిత్తం నగదును ఈ ప్రభుత్వం అందజేస్తున్నది.

అధ్యక్షా, అంతేగాకుండా, హాస్టల్స్ అన్నింటిని రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చే ఒక పెద్ద కార్యక్రమాన్ని ఈ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసింది. మన భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా జరగలేదు. కొన్ని వేల కోట్ల రూపాయలతో మన రాష్ట్రంలోని హాస్టల్స్ అన్నింటిని రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాము. అన్ని ఎస్టీ హాస్టల్స్‌ను కూడా రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాము. ఎస్సీ కార్పోరేషన్ నుంచి, సెర్ప్ ద్వారాను, డ్వాక్రా మహిళల ద్వారా భూమి కొనుగోలు పథకాన్ని అమలుచేస్తున్నాము.

అధ్యక్షా, అలాగే గౌరవ సభ్యులు శ్రీ పి.జె. చంద్రశేఖర రావుగారు అడిగిన ప్రశ్నలకు నేను సమాధానం చెప్పవలసిన అవసరం ఉన్నది. ప్రస్తుతం ప్లాన్-నాన్ ప్లాన్ అనే అంశం లేదు కాబట్టి, ఈ సబ్ ప్లాన్ అనే మాటను వాడకుండా దీనికి development inclusion fund అని చెప్పి స్థిరీకరణ అభివృద్ధి నిధులు అని నూతన నామకరణం కూడా చేయాలని గౌరవ ముఖ్యమంత్రిగారు సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ యాక్టుకు కొన్ని అమెండ్‌మెంట్లు తీసుకురావడానికి గాను ఒక కమిటీని వేయడం జరిగింది. ఆ అంశాన్ని కూడా గౌరవ ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువెళ్ళి తప్పకుండా పరిశీలిస్తాము.

గౌరవ సభ్యురాలు శ్రీమతి పమిడి శమంతకమణి గారు అడిగిన ప్రశ్నకు వివరణ చెప్పవలసిన బాధ్యత నాపైన ఉన్నది. అలాగే, ఈ యాక్టుకు సంబంధించి జిల్లాలో మానిటరింగ్ కమిటీలు ఉన్నాయి. ఈ యాక్టును అమలు చేయడానికి, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను సక్రమంగా ఖర్చు పెట్టడానికి మరియు ఆ పథకాలను అమలు చేయడానికి జిల్లా స్థాయిలో, జిల్లా కలెక్టరు అధ్యక్షతన ఒక మానిటరింగ్ కమిటీ ఉంది. ఆ కమిటీలో అధికారులు కాకుండా, స్పెషల్ ఇన్‌వైటీలు కూడా ఉంటారు. వీరందరూ ఇచ్చిన సూచనలు మరియు యాక్టు ప్రకారం స్పెషల్ ఇన్‌వైటీలుగా స్వచ్ఛంద సేవా సంస్థలలో పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా త్యాగపూరితంగా సేవ చేస్తున్నటువంటి వారు ఎవరైతే ఉన్నారో వారిని స్పెషల్ ఇన్‌వైటీలుగా తీసుకుని ఈ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల అమలులో వారి సేవలను కూడా తీసుకుంటామని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గారు చెప్పిన అంశానికి సంబంధించి అక్కడ వరదలు వచ్చినప్పుడు నేను కూడా ఆ ప్రాంతానికి వెళ్ళి చూశాను. తప్పకుండా అక్కడ బ్రిడ్జి అవసరం ఉంది. దానికి రూ.5.4కోట్ల అవసరం అవుతుందని చెప్పారు. దీనికి గౌరవ ముఖ్యమంత్రిగారు కూడా సూత్రప్రాయంగా అంగీకరించారు. ఈ బ్రిడ్జిని సబ్‌ప్లాన్ నిధుల ద్వారా తప్పకుండా అలాట్ చేసే ప్రయత్నం చేస్తాము. అలాగే, గౌరవ సభ్యులు శ్రీ రాము సూర్యారావు గారు చెప్పినట్లుగా ఈ సబ్‌ప్లాన్ అమలు చేసే ప్రక్రియలో భాగంగా దళిత సంఘాలు, ప్రజా సంఘాల యొక్క సూచనలు, సలహాలు,

భాగస్వామ్యం తీసుకోమని చెప్పారు. తప్పకుండా జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీలో స్పెషల్ ఇన్వైటీలుగా దళిత సంఘాలు మరియు ప్రజా సంఘాల నాయకులను తీసుకుని, ఈ సబ్‌ప్లాన్ నిధుల అమలులో వారి సేవలను కూడా మేము వాడుకుంటాము.

ఉ. 11.00

ఈ విధంగా ఎస్సీ,ఎస్టీ సబ్-ప్లాన్ ఏదైతే ఉందో దాని గురించి ఈ సభ ద్వారా ధైర్యంగా చెప్పగలను. భారతదేశంలో బహుశః ఇంత పెద్ద ఎత్తున ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ని చిత్తశుద్ధితో అమలు చేస్తున్న ప్రభుత్వం మరొకటి లేదని అనుకుంటున్నాను. గతంలో ఈ నిధుల్ని డైవర్ట్ చేసేవారు, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాగితాల మీద చూపించేవారు. గతంలో వీటన్నింటిని దుర్వినియోగం చేశారు. ఎస్సీ,ఎస్టీ సబ్-ప్లాన్ క్రింద 60 శాతం కూడా నిధులు ఖర్చు పెట్టలేదు. పది సంవత్సరాలు కాంగ్రెసు పార్టీ వారు అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీ సబ్-ప్లాన్ ఖర్చు చూస్తే 60 శాతం కూడా చేయలేదు. గత సంవత్సరం ఎస్సీ, ఎస్టీ ట్రైబల్ సబ్-ప్లాన్ క్రింద 101 శాతం అంటే ఎక్కువ ఖర్చు పెట్టాము. 100 శాతం కంటే ఎక్కువ ఖర్చు పెట్టాము. గత సంవత్సరంలో ఎస్సీ సబ్-ప్లాన్ క్రింద 99.4 శాతం ఖర్చు చేశాము. అంతకుముందు సంవత్సరం 97 శాతం ఖర్చు చేశాము. ఈ సంవత్సరం నాటికి నూరు శాతం ఖర్చు పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నాము. నిన్న చీఫ్ సెక్రటరీ గారు కూడా ఆర్డర్స్ పాస్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్-ప్లాన్‌కి సంబంధించి వర్క్ బిల్స్ అన్నీ పెండింగ్ పెట్టకుండా రిలీజ్ చేయమన్నారు. తప్పకుండా ఎస్సీ, ఎస్టీ సబ్-ప్లాన్ ద్వారా దళిత, గిరిజనుల యొక్క అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతూ, ఎక్కడెక్కడ ఏ ఏ రంగాలలో వెనుకబడి ఉన్నారో ఆ రంగంలో ఉన్న వారి వెనుకబాటుతనాన్ని తీసివేస్తాము. దళిత, గిరిజనుల జీవన ప్రమాణాలను పెంచుతాము. దళిత, గిరిజనులను మిగతా సామాజిక వర్గాలతోపాటుగా సమానంగా అభివృద్ధి చేయడానికి, చట్టంలో నిర్దేశించిన విధంగా తప్పకుండా కృషి చేస్తాము. ఈ సబ్-ప్లాన్ ద్వారా ఎస్సీ, ఎస్టీల జీవితాలలో ఆనందాన్ని, వెలుగులను నింపుతూ అభివృద్ధి సంక్షేమానికి పాటుపడతామని సభ ద్వారా, తమరి ద్వారా సభ్యులకు తెలియజేస్తున్నాను.

## సమాన పనికి సమాన వేతనం

ప్రశ్న నెం.9500(108)
సర్వశ్రీ/శ్రీమతి ఎం.వి.ఎస్.శర్మ, పి.జె. చంద్రశేఖర రావు, టి.రత్నాబాయి, ఎం.ఎల్.సి.లు,

గౌరవనీయులైన కార్మిక మరియు ఉపాధి కల్పన శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) ప్రభుత్వ శాఖలు / క్వాజి-ప్రభుత్వ శాఖలు / రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు / స్థానిక సంస్థలలో నియమితులైన కార్మికులకు / ఉద్యోగులకు “సమాన పనికి సమాన వేతనం” అనే సూత్రాన్ని అమలు చేస్తున్నారా?

ఆ) లేనట్టయితే అందుకు సంబంధించిన కారణాలు ఏమిటి?

గౌరవనీయులైన కార్మిక మరియు ఉపాధికల్పన శాఖ మంత్రివర్యులు (శ్రీ కె.అచ్చన్నాయుడు):

అ) అవునండీ. ఒకే విధమైన పని లేదా ఒకేరకమైన స్వభావం గల పనికి పురుష, మహిళా కార్మికులకు సమాన వేతనాలను ఇచ్చే విధంగా చూడటానికి మరియు లింగ వివక్ష నివారించడానికి 1976, సమాన వేతన చట్టాన్ని అమలు చేయడమయింది.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

MR. CHAIRMAN: It is already 11.03am. I am going only with single supplementary and only with the printed names.

శ్రీ ఎం.వి.యస్.శర్మ (పట్టభద్రుల నియోజకవర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం): అధ్యక్షా, ఇటీవల సుప్రీంకోర్టు తాత్కాలిక ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలనే తీర్పును వెల్లడించింది. "సమాన పనికి సమాన వేతనం" అంటే స్త్రీ, పురుషులిద్దరికీ సమాన వేతనం ఇవ్వాలనే చట్టాన్ని వారు పూర్తి చేశారు. మేము అడుగుతున్నది "సమాన పనికి సమాన వేతనం" ఇవ్వాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను బట్టి ఈ రాష్ట్ర ప్రభుత్వం అమలు జరుపుతున్నదా? అనేక రకమైన శాఖలలో రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలకు, కాంట్రాక్టు పద్ధతిలో అదే ఉద్యోగం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకి ఇస్తున్న వేతనాలకు మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉన్నది. ఇటీవల కాంట్రాక్టు అధ్యాపకులకు "సమాన పనికి సమాన వేతనం" ఇవ్వాలని ఆందోళన చేశారు. అలాగే ఇతర డిపార్టుమెంటు ఉద్యోగులు కూడా ఆందోళనలో ఉన్నారు. వారికి సమాన వేతనం మినిమమ్ టైం స్కేలుతో సమానంగా చెల్లించే ప్రతిపాదన ప్రభుత్వానికి ఉన్నదా? ఎప్పటిలోగా అమలు చేస్తారని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : అధ్యక్షా, అది అత్యంత దురదృష్టకరమైన అంశం. ప్రశ్న ఏమిటంటే "Whether the principle of "equal wage for equal work" is being implemented to the workers/employees engaged in all Government Departments/ Quasi-Government Departments/State public sectors/Local bodies." అధ్యక్షా, ఏ లోకల్ బాడీలో కాంట్రాక్టు క్రింద పనిచేసే వర్కర్లకి అదే లోకల్ బాడీలో పనిచేస్తున్న రెగ్యులర్ వర్కర్లకి సమాన వేతనం ఇస్తున్నారు. ఏ పబ్లిక్ ఇన్‌స్టిట్యూషన్‌లో జూనియర్ కళాశాలలోని, డిగ్రీ కళాశాలలోని కాంట్రాక్ట్ అధ్యాపకులను పర్మినెంట్ అధ్యాపకులతో పోల్చి చూస్తే 1/3వ వంతు కూడా వేతనాలు లేవు. ఈ వేతనాలలో వివక్షతను తొలగించడానికి పంజాబ్, హర్యానాకు సంబంధించినటువంటి గవర్నమెంటు ఉద్యోగులు, క్యాజువల్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్లు హైకోర్టులోను, సుప్రీంకోర్టులోను కేసు వేస్తే సుప్రీంకోర్టు ద్వారా ఘాటైనటువంటి డైరెక్షన్ throughout India (ద్వారా) ఇవ్వడం జరిగింది. దురదృష్టం ఏమిటంటే మేము అడిగిన ప్రశ్న చాలా స్పష్టంగాను, వివరంగాను ఉంటే స్త్రీ, పురుషులకి వేతనాలు సగం ఇస్తున్నదా? పూర్తిగా ఇస్తున్నదా అని చెబుతున్నారు అదొక ఆబ్జెక్టు. స్త్రీ, పురుషులకి సగం జీతాలు ఇవ్వడం అనేది unorganised సెక్టారులో అసలు లేనే లేదు. Organised సెక్టారులో ఉన్నమాట వాస్తవం. అడిగింది మాత్రం లోకల్ బాడీస్‌లో ప్రభుత్వ శాఖలు, క్వాజీ–ప్రభుత్వ శాఖలు గాని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, రెగ్యులర్ ఉద్యోగుల మధ్యలో ఉన్న వేతన వ్యత్యాసాలను తొలగించడానికి ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారు మేము సభలో అడిగితే 'ఎస్ సార్' అంటున్నారు, 'does not arise' అంటున్నారు ఏమిటి అధ్యక్షా, ఇది.

శ్రీ కె. అచ్చన్నాయుడు: అధ్యక్షా, 1978వ సంవత్సరంలో "సమాన పనికి సమాన వేతనం" అనే చట్టం వచ్చింది. ఇప్పుడే సభ్యులు చెప్పినట్లుగా కొంతమంది ఉద్యోగులు హైకోర్టుకి, సుప్రీంకోర్టుకి వెళితే, తేది. 26–10–2016వ తేదిన సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పును ఇచ్చింది. ఇస్తూ, 18 విధివిధానాలతో సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంది. ఈ 18 విధివిధానాలు అమలు జరిగితేనే వారికి "సమాన పనికి సమాన వేతనం" అని సుప్రీం కోర్టే తీర్పు ఇచ్చింది. 18 విధివిధానాలను చూస్తే ఎక్కడా ఫుల్‌ఫిల్ అయ్యే పరిస్థితి లేదు. అయినాసరే, మన రాష్ట్రంలో 1978వ చట్టాన్ని పరిగణనలోకి తీసుకుని 2006వ సంవత్సరంలోనే జి.ఓ. 2501 ను జారీ చేయడం జరిగింది. రెగ్యులర్ పోస్టులకి సమానమైనటువంటి పోస్టులో తాత్కాలిక ఉద్యోగులు పనిచేసినట్లయితే, రెగ్యులర్ ఉద్యోగులకు వర్తింపజేసే పే స్కేలులో, మినిమమ్ పే స్కేలుకు తాత్కాలిక ఉద్యోగులు కూడా అర్హులని ఆ రోజు జి.ఓ ఇచ్చి అమలు చేయడం జరిగింది. మన రాష్ట్రంలో అది అమలు జరుగుతోంది. అయితే పి.ఆర్.సి.లు పెరుగుతున్నాయి.

అధ్యక్షా, 2006వ సంవత్సరంలో ఒక జి.ఓ ఇచ్చాము. మళ్లీ 2010వ సంవత్సరంలో పి.ఆర్.సిలో వేతనాలు పెరిగితే, అదే సంవత్సరంలో జి.ఓ.ఎం.ఎస్.నెం.3 అమలు చేసి వేతనాలను పెంచడం జరిగింది. శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రి అయినప్పుడు మరలా పి.ఆర్.సి పెరిగితే, జి.ఓ.ఎం.ఎస్.నెం.151 ఈ మధ్యనే అమలు చేశాము. మన రాష్ట్రంలో మాత్రము వంద శాతం ఎవరైతే ప్రభుత్వంలో పనిచేస్తున్న వారున్నారో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గాని, కాంట్రాక్టు ఉద్యోగులకు గాని సమాన పనికి సమాన వేతనం వారు జాయిన్ అయినప్పుడు ఉన్నటువంటి పే స్కేల్‌తో సమానంగా వర్తింపచేస్తున్నాము. ఈ మధ్య పి.ఆర్.సి పెరిగిన వెంటనే ఈ రాష్ట్రంలో మనం కూడా కొత్తగా జి.ఓ.ఎం.ఎస్.నం.151 ఇచ్చి అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా సభ్యులకు తెలియజేస్తున్నాను. ప్రైవేటు సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగు ఉద్యోగులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలంటే సుప్రీంకోర్టు ఇచ్చినటువంటి 18 విధివిధానాలతో సమానంగా ఉంటేనే మనం వారి మీద చర్య తీసుకోగలము. లేబర్ డిపార్టుమెంటు వారి నుంచి కేసులు పెట్టడానికి అవకాశం ఉంటుంది కాబట్టి, మన రాష్ట్రంలో మాత్రం మీరు అడిగిన విధంగా ఈ రోజు అటెండర్లకు కూడా రూ. 15,000/- వేతనం ఇస్తున్నాము.

అధ్యక్షా, అటెండర్లకు ఇంతకుముందు రూ. 7,000/- ఉంటే ఇప్పుడు రూ.15,000 వేతనం ఇస్తున్నాము. జి.ఓ.ఎం.ఎస్.నెం.151 అమలు చేసిన తరువాత అటెండర్లకు గాని, అసిస్టెంట్లకు గాని అందరికీ పి.ఆర్.సి ప్రకారం వేతనాలు పెంచడం జరిగింది. ఎవరికైనా పెరగకపోతే మా దృష్టికి తీసుకువస్తే డిపార్టుమెంట్ తరఫున అమలు చేయడానికి ఈ ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది లేదని మీ ద్వారా సభ్యులకు తెలియజేస్తున్నాను.

ఉ.11.10

## ఎంపిటిసిలకు చెక్కు పవర్

ప్రశ్న నెం. 9627(109)
శ్రీ శిల్పా చక్రపాణి రెడ్డి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన పంచాయతీరాజ్ శాఖ మంత్రిగారు దయచేసి ఈక్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) ఎంపిటిసి లకు చెక్కు పవర్ సౌకర్యాన్ని కల్పించే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా ?

ఆ) అయితే, ఆ వివరాలేమిటి?

గౌరవనీయులైన పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా & ఎన్ఆర్ఈజిఎస్ శాఖ మంత్రివర్యులు (శ్రీ సి.హెచ్.అయన్నపాత్రుడు):

అ) లేదండి.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ శిల్పా చక్రపాణి రెడ్డి ( స్థానిక సంస్థలు - కర్నూలు): అధ్యక్షా, మన ప్రభుత్వం వచ్చిన తరువాత, ఎన్నో కష్టాలలో, ఇబ్బందులలో ఉన్నా స్థానిక సంస్థలకు వేతనాలు పెంచినందుకు మన గౌరవ ముఖ్యమంత్రి గారికి, గౌరవ మంత్రి గారికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. అదేవిధంగా ఎంపిటిసిలకు, జడ్‌పిటిసిలకు విధులు, నిధులు కేటాయించాలనేది మా ప్రశ్న. జిల్లా పరిషత్ ఛైర్మన్‌కు గతంలో రూ.7,500 వేతనం

చెల్లిస్తుంటే ప్రస్తుతం వారి వేతనం రూ.40,000 వరకూ పెంచడం జరిగింది. జడ్‌పిటిసిలకు గతంలో రూ.2,250 వేతనం ఉంటే ప్రస్తుత వేతనం వారికి రూ.6,000లకు పెంచడం జరిగింది.

మిస్టర్ ఛైర్మన్: శిల్పా చక్రపాణి రెడ్డి గారు, సప్లిమెంటరీ వేయండి?

శ్రీ శిల్పా చక్రపాణి రెడ్డి: విధులు, నిధుల గురించి మాట్లాడతాను సార్, అయిపోయింది. రెండు నిమిషాలు మాత్రమే సమయం తీసుకుంటున్నాను. ఎందుకంటే, వారు నన్ను రెండవ సారి ఎన్నుకున్నందుకు గాను వారి తరఫున నేను మాట్లాడుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్: మీరు ఎమ్.పి.టి.సి.ల గురించి అడిగారు.

శ్రీ శిల్పా చక్రపాణి రెడ్డి: అవును సార్. మేము ఎంపిటిసిల గురించే అడుగుతున్నాము. వారి జీతాలు పెంచారు. ఇంకా వారికి కొన్ని నిధులు కేటాయించి, జీతాలు పెంచమని అడుగుతున్నాము. ప్రతి ఎంపిటిసికి సుమారుగా రూ.10 లక్షల విలువ చేసే పనులను, ప్రతి జడ్‌పిటిసికి రూ.25 లక్షల విలువ చేసే పనులను కేటాయించాలని మరియు వారికి చెక్కు పవర్ సౌకర్యాన్ని కల్పించాలని మేము గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాము. ఇదే మా ముఖ్య విజ్ఞప్తి. అదే విధంగా ఎమ్‌పిటిసిల గౌరవ వేతనం రూ.3,000 నుండి రూ.5,000 వరకూ, జడ్.పి.టి.సి.ల గౌరవ వేతనం రూ.6,000 నుండి రూ.10,000 వరకూ పెంచాలని మరియు జడ్.పి.టి.సి.లు జిల్లా మీటింగ్‌కు హాజరు కావడానికి వారికి వాహన సౌకర్యం కల్పించడానికి నిధులు కేటాయించాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాము. అదే విధంగా జిల్లా పరిషత్, మండల ప్రజా పరిషత్‌లకు, 14వ ఆర్థిక సంఘం ద్వారా వచ్చే నిధులు నిలిచిపోయినందువల్ల జిల్లా పరిషత్, మండల ప్రజా పరిషత్‌లు నిర్వీర్యమై, ఉత్సవ విగ్రహాలుగా మారిపోయినవి. కాబట్టి, ప్రతి మండల ప్రజా పరిషత్‌కు కోటి రూపాయల నిధులను కేటాయించాలి. ప్రతి ఎంపిటిసి, జడ్‌పిటిసిలకు టెలిఫోన్ సౌకర్యాన్ని కల్పించాలని తమ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

MR. CHAIRMAN: It appears, you are giving a representation to the Minister.

శ్రీ అంగర రామమోహన్: సార్,....

MR. CHAIRMAN: Ram Mohan Rao, please take your seat, I am not allowing you.

శ్రీ శిల్పా చక్రపాణి రెడ్డి: అధ్యక్షా, కర్ణాటకలో, తెలంగాణలో స్థానిక సంస్థల ఎం.ఎల్.సిలకు రూ.3 కోట్లు కేటాయిస్తున్నారు. అదేవిధంగా, స్థానిక సంస్థల ఎం.ఎల్.సిలకు రూ.3 కోట్లు నిధులు కేటాయిస్తే, మా ఎంపిటిసి, జడ్‌పిటిసిలకు కొంత వరకు నిధులు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది కాబట్టి, తప్పకుండా ఈ విధమైన ఏర్పాటు చేస్తారని ఆశిస్తున్నాను.

MR.CHAIRMAN: (Addressing Sri Angara Rama Mohan Rao) You want to take part. I am not allowing you. Why do you deviate from the procedure? Please take your seat...

శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్ ( స్థానిక సంస్థలు – కృష్ణా): అధ్యక్షా, మాకు కూడా అవకాశం ఇవ్వండి.

మిస్టర్ ఛైర్మన్ : మీరు మాట్లాడతారా?

శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్: మాట్లాడతాను సార్.

శ్రీ శిల్పా చక్రపాణి రెడ్డి : అధ్యక్షా, ఎంపిటిసి,జడ్‌పిటిసిలకు సంబంధించినది....

మిస్టర్ ఛైర్మన్ : దేని గురించి? వారినే అనుమతించలేదు, మిమ్మల్ని అనుమతిస్తానా?... మీరు అడిగిన దానికి పంచాయతీ రాజ్ శాఖా మంత్రిగారు చాలా వివరంగా చెప్పారు. మీరు అడిగింది ఎంపిటిసిలకే కానీ, వారు జడ్‌పిటిసిల గురించి కూడా చెప్పారు.

శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్: అధ్యక్షా, మాకు కూడా అవకాశం ఇవ్వమని మేము అడిగాము. టీచర్లు ఒక ప్రశ్న వేస్తే పది మంది మాట్లాడడానికి అవకాశం ఇస్తారు. లోకల్‌బాడీస్ నుండి మేము 30 మంది సభ్యులం ఉన్నాము. మాకు అవకాశం ఇవ్వరా?

మిస్టర్ ఛైర్మన్ : ఇవ్వను. అది కాదు సార్, సమయం ఉ.11.15 అయ్యింది. మీరు సుమారుగా 10 సంవత్సరాలు సభలో ఉన్నారు. ఉ.11.00 గంటల తరువాత మాట్లాడడానికి అనుమతిస్తారా? Take your seat Babu...

శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్: అధ్యక్షా, అలాంటప్పుడు మేమెందుకు ఇక్కడకి రావడం? మాకు మాట్లాడడానికి అవకాశం ఇవ్వరు. ఎమ్‌పిటిసి, జడ్‌పిటిసిల గురించి మాట్లాడడానికి అవకాశం ఇవ్వరు? టీచర్లకు అవకాశం ఇస్తున్నారు. వారు ఎంతసేపైనా మాట్లాడడానికి అవకాశం ఇస్తారా? మమ్మల్ని మాట్లాడడానికి అవకాశం ఇమ్మని ఎన్ని సార్లు అడిగినా కూర్చో అంటున్నారు.

మిస్టర్ ఛైర్మన్ : మీరు ప్రశ్న వేయలేదు కదా? Rajendra Prasad garu, please take your seat... సమయం అయిపోతోంది. మరలా ప్రజెంటేషన్ ఉంది. పంచాయతీ రాజ్ అంటే వారికి సంబంధించిన విషయం.

శ్రీ సి.హెచ్.అయన్నపాత్రుడు: అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం, 1994 ప్రకారం పరిపాలన బాధ్యతలు నిర్వర్తిసున్న అధికారికి చెక్కు పవర్ ఇవ్వడం జరిగింది. మండల పరిషత్‌లో ఎంపిడిఓ, జిల్లా పరిషత్‌లో సి.ఇ.ఓలు ప్రస్తుతం చెక్కు డ్రా చేసే అధికారం కలిగి ఉన్నారు. అదే విధంగా పంచాయతీ రాజ్ వ్యవస్థలో జిల్లా పరిషత్‌లో సి.ఇ.ఓ, మండల పరిషత్‌లో ఎంపిడిఓలకు చెక్కు పవర్ ఉంటుంది. పంచాయతీలకు వచ్చే సరికి పంచాయతీ సర్పంచ్‌కు మాత్రమే చెక్కు పవర్ ఉంటుంది. అది వారికి చట్ట రీత్యా వచ్చినటువంటి అధికారం. ఎం.ఎల్.ఏ.,లకు కూడా చెక్కు పవర్ లేదు. పరిపాలించే అధికారం మాత్రమే. అలానే, మంత్రులకు కూడా చెక్కు పవర్ లేదు. కేవలం అధికారం మాత్రమే ఉంది. ఇంకా చెప్పాలంటే ముఖ్యమంత్రిగా ఎవరున్నా కూడా వారికి కూడా చెక్కు పవర్ లేదు. పంచాయతీ సర్పంచ్‌కు మాత్రమే చెక్కు పవర్ ఉంటుంది. అలా అని వారు కూడా వారి ఇష్ట ప్రకారం చెక్కు మీద సంతకం చేయడానికి అధికారం లేదు. వారు పంచాయతీల ముందు రిజల్యూషన్ పాస్ చేయాలి. బడ్జెట్‌ను కేటాయించాలి. వారు ఏ పని కోసం డ్రా చేస్తున్నారో ఆ పనికి సంబంధించిన వివరాలు తీసుకుని, పని పూర్తి చేసి, మరలా మెజర్‌మెంట్స్ నమోదు చేసిన తరువాత కార్యదర్శి తయారు చేసిన చెక్కు మీద సర్పంచ్‌కు మాత్రమే సంతకం పెట్టే అధికారం, చట్ట ప్రకారం నియమం ఉందని, తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, అదే విధంగా వారు రెండవ ప్రశ్న కూడా అడిగారు. 13,14వ ఆర్థిక సంఘం నుండి వచ్చే నిధులను ప్రస్తుతం జిల్లా, మండల పరిషత్‌లకు ఇవ్వడం లేదని అడిగారు. ఇది మన రాష్ట్ర ప్రభుత్వం చేసినటువంటి కార్యక్రమం కాదు. కేంద్ర ప్రభుత్వం నుండి వస్తున్నటువంటిది. 14 వ ఆర్థిక సంఘం నిధులన్నీ కూడా గతంలో మాదిరిగా కాకుండా నేరుగా పంచాయతీలకు ఇచ్చేటువంటి అధికారాన్ని వారు క్రియేట్ చేయడం జరిగింది. కేంద్రం నుండి ఎన్ని కోట్ల రూపాయల నిధులు విడుదల చేసినా, నేరుగా

13,000 పంచాయతీలకు వారి ఖాతాలకు వెళ్లడం జరుగుతుంది. గౌరవ సభ్యులు చెప్పినది వాస్తవం. దీని వలన మండల, జిల్లా పరిషత్ వ్యవస్థలు నిధులు లేక చాలా నిర్వీర్యంగా తయారయ్యాయి. వాటిని దృష్టిలో పెట్టుకుని, మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 14వ ఆర్థిక సంఘం నిధులలో కొంత శాతం నిధుల్ని జిల్లా, మండల పరిషత్‌లకు, మిగతా 50 శాతం నిధులు పంచాయతీలకు ఇవ్వాలనే ఆలోచన చేశారు. కానీ, కేంద్ర ప్రభుత్వం దానిని అంగీకరించడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇవ్వకపోతే, మన రాష్ట్ర ప్రభుత్వం నుండి ఏమైనా నిధులు కేటాయించగలమా అనే విషయంలో కూడా ఒక ఆలోచన ఉందని చెప్పి ఈ సందర్భంగా తమ ద్వారా మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, మూడవ విషయానికి సంబంధించి ఎంపిటిసిలకు, జడ్‌పిటిసిలకు వేతనాలు పెంచమని వారు కోరడం జరిగింది. గతంలో వారికి వేతనాలు సరిగా లేవు. నేను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత గౌరవ సభ్యులు, శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్ గారు వారి యూనియన్ సభ్యులంతా మా దగ్గరికి వచ్చారు. వారి వేతనాల గురించి మేమంతా కలసి మన గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువచ్చాము. గతంలో నెలకు జిల్లాపరిషత్ ఛైర్మన్‌కు రూ.7,500 వేతనం చెల్లించేవారు. మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు అధికారంలోకి వచ్చిన తరువాత వారికి ప్రతి నెలా రూ.40,000 వేతనం ఇవ్వాలని జీ.ఓ విడుదల చేయడం జరిగింది. అదే విధంగా జడ్.పి.టిసిలకు గతంలో రూ.2,250 వేతనం ఇచ్చేవారు. గత సంవత్సరం వారి వేతనం రూ.6,000 వరకూ పెంచారు. అదే విధంగా ఎం.పి.పిల వేతనాలు గతంలో కేవలం రూ.1,500 మాత్రమే ఉండేవి. ప్రస్తుతం మేము వారికి రూ.6,000 వేతనం చెల్లిస్తున్నాము. అదే విధంగా ఎం.పి.టి.సిలకు రూ.750 వేతనం మాత్రమే ఉండేది. ప్రస్తుతం మేము వారికి రూ.3,000 వేతనం చెల్లిస్తున్నాము. అలాగే సర్పంచులకు కూడా గతంలో నెలకు రూ.1,000 వేతనం మాత్రమే ఇచ్చేవారు. ప్రస్తుతం మేము వారికి రూ.3,000 వేతనం చెల్లిస్తున్నాము. ఇవన్నీ గత సంవత్సరం నుండే అమలులోకి వచ్చాయి. కాబట్టి , ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఈ సంవత్సరం మరలా వేతనాలు పెంచే అవకాశాలు లేవని, తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

MR.CHAIRMAN: (Addressing the Minister) You take the representations from the Member, examine them and see how best you can solve them.

శ్రీ సి.హెచ్.అయన్నపాత్రుడు: అలాగే సార్.

శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్: సార్,

MR. CHAIRMAN: There is a procedure Prasad. After 11 am, I go only with the printed names. ఆయన ప్రశ్న వేశారు కాబట్టి, అనుమతిస్తున్నాను. చివరకు విప్‌ను కూడా నేను అనుమతించలేదు. నా అనుభవం మీద నేను చేస్తున్నాను.

శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్: అధ్యక్షా, పది సంవత్సరాల నుండి చూస్తున్నాను.

MR. CHAIRMAN: Alright, come with a Motion under Rule 70, I will post it. I will discuss with you.

శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్: టీచర్లు ఒక ప్రశ్న వేస్తే చాలు, వారు పది మంది మాట్లాడడానికి అవకాశం ఇస్తారు.

MR. CHAIRMAN: After 11 a.m., I have not given. Don’t go on record.

శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్: మేము మీ వైఖరికి నిరసనగా బాయ్‌కట్ చేస్తున్నాము. మన రాష్ట్రంలో ఉన్న ఎంపిటిసి, జడ్‌పిటిసిలను చాలా చిన్న చూపు చూస్తున్నారు. మమ్మల్ని అవమాన పరస్తున్నారు. మీరు టీచర్లకు భయపడుతున్నారా? అందుకే వారికి, అవకాశం ఇస్తున్నట్లుంది. ఎం.ఎల్.సిలను కూడా మీరు చిన్నచూపు చూస్తున్నారు. మేమంటే లెక్క లేకుండా పోయింది. లోకల్‌బాడీస్ నుండి మేము 30 మంది సభ్యులం ఉన్నాము. ఇక్కడ ఉన్న సభ్యులలో మూడవ వంత మందిమి మేమే ఉన్నాము. కానీ, మాకు మాట్లాడడానికి అవకాశం ఇవ్వడం లేదు. (మైకు లేదు)

మిస్టర్ ఛైర్మన్: ఉదయం 11.00 గంటల తరువాత మాట్లాడడానికి అవకాశం ఉండదు. Prasad garu, procedure is the same for all.

ఉ.11.20

MR.CHAIRMAN: Next Question No.9584.

## చిత్తూరు జిల్లాలో పారిశ్రామిక రాయితీల లబ్ధిదారులు

ప్రశ్న నెం.9584 (110)
శ్రీ బి. నరేష్ కుమార్ రెడ్డి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) చిత్తూరు జిల్లాలో పారిశ్రామిక సబ్సిడీలను సమకూర్చేందుకు గుర్తించిన లబ్ధిదారుల సంఖ్య ఎంత?

ఆ) విడుదల చేసిన, పంపిణీ చేసిన, పెండింగ్‌లో ఉన్న మొత్తాల వివరాలు ఏమిటి?

గౌరవనీయులైన ముఖ్యమంతి గారి తరఫున గౌరవ ఆర్థిక శాఖా మంత్రివర్యులు
(శ్రీ యనమల రామకృష్ణుడు):

అ) చిత్తూరు జిల్లాలో 552 యూనిట్లకు పారిశ్రామిక సబ్సిడీని సమకూర్చడమవుతున్నది.

ఆ) మంజూరు చేసిన, విడుదల చేసిన, పెండింగ్‌లో ఉన్న మొత్తాల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| కేటగిరి | మంజూరు చేయబడినవి | విడుదల చేయబడినవి | పెండింగ్‌లో ఉన్నవి (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| భారీ మరియు చిన్న తరహా | 47.19 (15యూనిట్లు) | 42.00 (12 యూనిట్లు) | 5.19 (3 యూనిట్లు) |
| ఎంఎస్ఎంఇ | 94.33 (537 యూనిట్లు) | 68.28 (340 యూనిట్లు) | 26.05 (197 యూనిట్లు) |
| మొత్తం | 141.52 (552యూనిట్లు) | 110.25 (352 యూనిట్లు) | 31.24 (200 యూనిట్లు) |

శ్రీ బి.నరేష్‌కుమార్ రెడ్డి (స్థానిక సంస్థలు – చిత్తూరు): అధ్యక్షా, ఈ ఇండస్ట్రీలు మొదలైన తరువాత అప్లికేషన్లు దాఖలు చేసిన తరువాత మంజూరు చేయడానికి, మంజూరు చేసిన తరువాత నిధులు విడుదల చేయడానికి నాలుగైదు సంవత్సరాలు పడుతోంది. ప్రస్తుతం మంత్రిగారిచ్చిన సమాధానంలో ఏ సంవత్సరం

నుండి ఏ సంవత్సరం వరకు అనేది చెప్పలేదు. ఈ గ్యాప్‌ని తగ్గించేందుకు, సరైన సమయంలో సహాయం అందించేలా అప్లికేషన్ పెట్టుకున్న సంవత్సరంలోపు రాయితీ మొత్తాన్ని వారికి అందిస్తే, ఆ ఇండస్ట్రీలకు సక్రమంగా సహాయం చేసే అవకాశం ఉంటుంది కాబట్టి, ఆ చర్యలేమన్నా చేపడతారా అని అడుగుతున్నాను. ఇంకొకటేమంటే, ప్రస్తుతం 7 జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించడం జరిగింది. నిధులు విడుదల చేసేటప్పుడు, State as a Unit గా తీసుకుని, సీనియారిటీలో తీసుకుపోతున్నారు. ఎలాగూ, 7 జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా కేంద్రం గుర్తించింది కాబట్టి, ఈ 7 జిల్లాల్లో సీనియారిటీ తీసుకుని వాళ్ల నిధులు ఇచ్చే విధంగా ఏమన్నా చర్యలు చేపడతారా అని తమ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ యనమల రామకృష్ణుడుః గౌరవ సభ్యులు చెప్పిన విషయాన్ని పరిశీలిస్తాము.

MR.CHAIRMAN: All the Members are invited for the presentation on Polavaram. Now, we will go for Tea-Break for 15 minutes.

(Then, the House was adjourned at 11.22 a.m. for Tea-Break for 15 Minutes.)

మ.1.40

( తేనీటి విరామానంతరం సభ మధ్యాహ్నం గం.1.41 ని.లకు పునఃప్రారంభమయింది.)
(గౌరవ ఛైర్మన్ అధ్యక్షస్థానం వహించారు)

* * *

MR. CHAIRMAN: Now, Special Mentions.

## 4.సభా కార్యక్రమం–ప్రత్యేక ప్రస్తావనలు

శ్రీ ఎం.వి.ఎస్. శర్మ : అధ్యక్షా, పశ్చిమ గోదావరి జిల్లా తుందుర్రు ప్రాంతంలో ఒక ఆక్వా ఫుడ్ పార్క్ నిర్మాణం జరుగుతోంది. చుట్టుపక్కల అన్నీ పంట పొలాలున్నాయి. ఫ్యాక్టరీ కోసం ఆ ప్రాంతంలో ప్రజాభిప్రాయ సేకరణ గానీ, పర్యావరణ అనుమతులు గానీ లేవు. ఆ ఫ్యాక్టరీ నుండి రోజూ కొన్ని వేల లీటర్ల వ్యర్థ జలాలు రెగ్యులర్ కాలువలో కలిసి ఆ ప్రాంతంలోని పంటలన్నీ నాశనమయ్యే పరిస్థితి ఉన్నది. త్రాగు నీరు కూడా కలుషితమయ్యే ప్రమాదమున్నది. కాబట్టి, ప్రజలందరూ ఆక్వా ఫుడ్ పార్క్ నిర్మాణం గురించి పునరాలోచన చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తమ ద్వారా ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తూ, వారు అందించిన దరఖాస్తును అందచేస్తున్నాను.

డా. ఎం. గేయానంద్ : అధ్యక్షా, కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలో శకునాల, గని అని రెండు రెవెన్యూ గ్రామాలున్నాయి. అక్కడ ప్రభుత్వం సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి ప్రతిపాదన చేసి రైతుల వద్ద నుండి 5,600 ఎకరాలను తీసుకున్నది. ఇందులో పేదలకిచ్చిన పట్టా భూములున్నాయి. పట్టాలు లేకపోయినా దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్నటువంటి సాగు భూములు కూడా ఉన్నాయి. వేలాది మంది రైతుల నుండి వేలాది ఎకరాలు తీసుకున్నా కూడా ఇంతవరకూ నష్టపరిహారం గురించి ప్రభుత్వం ఏమీ చెప్పడంలేదు. 2013, భూసేకరణ పునరావాస చట్టాన్ని ప్రభుత్వమే అక్కడ అతిక్రమిస్తున్నది. ఎవరైనా ప్రశ్నిస్తే, అధికారులు నిరంకుశంగా ప్రవర్తిస్తున్నారు. మహిళా రైతులను జైళ్లకు పంపించారు. వందలాది

రైతుల మీద కేసులు పెట్టారు. రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి. అదేవిధంగా వ్యవసాయ కూలీలు, గొర్రెల పెంపకందారులకు ఉపాథి లేదు కాబట్టి వారికి కూడా నష్టపరిహారం ఇవ్వాలి.

రాయలసీమను సోలార్ ప్లాంట్స్‌తో ప్రపంచానికే రాజధానిగా చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా చెబుతున్నది. కానీ, దీనివల్ల రైతులు, ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. కాబట్టి ఈ రైతులకు, వ్యవసాయ కూలీలకు, గొర్రెల పెంపకందారులకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వవలసిందిగా మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ కలిదిండి రవికిరణ్ వర్మ (పట్టభద్రుల నియోజకవర్గం – తూర్పు, పశ్చిమ గోదావరి): : సార్, గత సంవత్సరం, ఈ సంవత్సరం కూడా కోనసీమ రైల్వే లైన్ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ మంజూరు చేశాయి అందుకు చాలా సంతోషం. అయితే, అక్కడ ఇంకా పనులు మొదలు కావడం లేదు. ఇప్పటికే రెండు సంవత్సరాలు అయిపోయింది. ఇలా అయితే, వచ్చే సంవత్సరం బడ్జెట్‌ను కేటాయించడం చాలా సమస్యగా ఉంటుంది. డబ్బులు లేకపోతే పనిచేయడం కష్టమే. కానీ, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులు వచ్చినా కూడా రెండు సంవత్సరాల నుండి పనులు మొదలు కాలేదు. ల్యాండ్ అక్విజిషన్ కూడా సమస్యేమీ కాదు. అది కూడా ఆల్‌మోస్ట్ అయిపోయింది. సరైన కోఆర్డినేషన్ లేకపోవడం, ఇనీషియేషన్ లేకపోవడం వల్ల పనులు జరగడం లేదు. 2012, 2013 కు ముందు అమలాపురం ఆర్‌డిఓ కార్యాలయంలో స్పెషల్ లైజెనింగ్ ఆఫీసరు, ఆర్‌డిఓ స్థాయి అధికారి ఒకరు, ఒక సర్వేయరుతో కలిపి మొత్తం అక్కడ ఇద్దరు, ముగ్గురు అధికారులుండేవారు. ఇప్పుడు అక్కడ ఎవరూ లేరు. అందుకు సంబంధించిన కార్యాలయాన్ని కూడా అక్కడనుండి తీసేశారు. తమ ద్వారా నేను ప్రభుత్వానికి విన్నవించుకునేదేమంటే, వెంటనే ఒక లైజెనింగ్ అధికారిని ఏర్పాటు చేసి ప్రతి మూడు నెలల కొకసారి పనులను అప్‌డేట్ చేస్తే, రాబోయే రెండు, మూడు సంవత్సరాల్లో పూర్తవుతుంది. వెంటనే పనులు జరగకపోతే మాత్రం మంజూరైన నిధులు వృథా అవుతాయి. కాబట్టి వెంటనే పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

## 5. సాంఘిక భద్రతా పథకాలపై లఘు చర్చ కొనసాగును

MR. CHAIRMAN : Now, Short Discussion on Social Security Schemes.

శ్రీ గొనివారి శ్రీనివాసులు (నామినేటెడ్): అధ్యక్షా, సాంఘిక భద్రత పథకాలపై మాట్లాడే అవకాశం కల్పించినందుకు చాలా సంతోషం. భారతదేశానికి 1947వ సంవత్సరంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, 1983వ సంవత్సరంలో ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన కీ.శే. శ్రీ నందమూరి తారక రామారావు గారు వారి పరిస్థితులను గమనించి తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట, ఉండడానికి ఇల్లు అనే నినాదంతో ఎన్నికల సమయంలో వాగ్దానం చేయడమే కాకుండా ఈ కార్యక్రమాలను ఆచరణలోకి తెచ్చిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నాను. రూ.2లకు కిలో బియ్యం పథకం రాకముందు చాలా ప్రాంతాలలో వారంలో మిగతా రోజులన్నీ రాగి సంకటి, ఒక్క శనివారం మాత్రమే అన్నం తినే పరిస్థితి ఉండేది. మరి అలాంటిది అన్ని రోజులూ అన్నం తినేవిధంగా చేసిన చరిత్ర నందమూరి తారకరామారావుదైతే, ఆ తరువాత వచ్చినటువంటి మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిదే.

ఈనాడు సాంఘిక భద్రతా పథకం గురించి చాలా మంది చాలా రకాలుగా మాట్లాడుతున్నారు. అందులో ఉండే లొసుగుల గురించి మాట్లాడుతున్నారే తప్ప దానివల్ల ఎంతమందికి మేలు జరుగుతోందో మాట్లాడే పరిస్థితి లేదు అధ్యక్షా. మహాత్మా గాంధీ ఒక మాట చెప్పారు– “బాగా చదువుకున్న ధనవంతులు

కొందరు తమంతట తాముగా పేదరికాన్ని అవలంబించకపోతే సమాజంలో ఎలాంటి సంస్కరణలు సాధ్యం కావు." ఈ మాటలు మరొక్కసారి గుర్తుకు తెచ్చుకుంటూ, సమాజంలో ఉండే వారందరూ సక్రమంగా భోజనం చేయాలనే ఉద్దేశంతో బీదరికంలో ఉండేవారందరికీ పెన్షన్ వంటి అనేక పథకాల ద్వారా మేలు చేకూరుస్తున్నారు. గతంలో పాలించిన చాలామందికి ఈ పెన్షన్ విషయం తెలియదు. ఆ రోజు కూడా ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారక రామారావు గారే రూ.35 లతో పెన్షన్ పథకాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకుంటే 2004 వరకూ ఉన్న ముఖ్యమంత్రిగారు రూ.75 వరకూ పెంచారు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం రూ.200లకు పెంచడం జరిగింది. ఆ తరువాత పది సంవత్సరాల పాటు పేదవారిని పరిస్థితులను గమనించి పాదయాత్ర చేసినప్పుడు వారు చెప్పిన హృదయవిదారకమైన మాటలను విని అధికారం చేపట్టిన తరువాత రూ.200ల పెన్షన్‌ను రూ.1000లు చేశారు. ఇక్కడ ఒక విషయం గుర్తుకు వస్తున్నది. మదర్ థెరీసాగారు ఒక మాట చెప్పారు. "Not all of us can do great things. But, we can do small things with great love." నిజంగా చెప్పాలంటే శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు చేసినవి స్మాల్ థింగ్స్ కావు. బీదరికంలో ఉన్నవారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో ఆయన చేసిన విషయాలను గుర్తుకు తెచ్చుకుంటే పెద్దలు చెప్పినట్లు " The hands that help are holier than the lips that pray." ప్రార్థించే పెదవుల కన్నా, సహకరించే కరములు మేలు అనే మాట గుర్తుకు వస్తున్నది. అలా సహకరించే కరములను ప్రభుత్వ పరంగా నేనిస్తాను అని ఈనాడు రూ.16,000 కోట్ల లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ సుమారు 47 లక్షల మందికి ఠంఛనుగా 1 వ తారీఖు నుండి 5వ తారీఖు వరకూ పింఛనును అందచేస్తున్నారు. అలాగే, ఒక్క రూపాయికే కేజీ బియ్యాన్ని ఇస్తూ, ఇతర నిత్యావసర సరుకులను పంపిణీ చేయడమే కాకుండా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేస్తున్న విషయాలను గుర్తుకు తెచ్చుకుంటే "మానవ సేవే మాధవ సేవ" అన్న మహాత్మా గాంధీగారి మాటలు గుర్తుకు వస్తున్నాయి.

మ. 01.50

ఈరోజు మనం ఒకసారి గుర్తుకు తెచ్చుకుంటే, ఆ బాపు ఈ బాబును ఆవహించాడేమోనన్న విషయాన్ని మనమంతా మాట్లాడుకునేటటువంటి పరిస్థితి నేడుంది. ఆనాడు బాపుగారు చెప్పారు. ఈనాడు బాబు గారు దానిని బ్రహ్మాండంగా కార్యక్రమాల రూపంలో అమలు చేస్తున్నారనే విషయాన్ని మనం గుర్తు చేసుకోవాలి. మీకందరికీ బాగా తెలుసు. గతంలో చాలామంది రేషన్ షాపు డీలర్లు ఎవరికైతే కార్డు ఉంటుందో అటువంటి కార్డులన్నీ కూడా వారి వద్ద పెట్టుకోవడం జరిగింది. నేడు ఈపోస్ విధానం మరియు ఇతర కార్యక్రమాలు అమలులోకి తీసుకువచ్చిన తర్వాత చౌకధరల దుకాణాలలో ఉన్నటువంటి అక్రమ కార్డులన్నీ కూడా బయటపడడం జరిగింది. ఎవరైతే నిజమైన లబ్దిదారులున్నారో వారికే బియ్యం పథకం ద్వారా లబ్ది చేకూరే విధంగా నేటి ప్రభుత్వం కార్యక్రమాలను అమలుచేస్తోన్న విషయాన్ని ఒకసారి గుర్తుకు తెచ్చుకోవాలి. అంగన్‌వాడీల ద్వారా బీదరికంలో ఉన్న గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించడం, సంరంక్షించడం కోసం ఎన్నో కార్యక్రమాలను అంగన్‌వాడీల ద్వారా చేస్తూ ఇంకా అనేక కార్యక్రమాలను గౌరవ ముఖ్యమంత్రి గారు చాలా చక్కగా చేస్తున్నటువంటి విషయాన్ని మనమంతా గుర్తుకు తెచ్చుకోవాలి.

అధ్యక్షా, సాంఘిక భద్రత విషయంలో సమాజంలో ఆర్థిక అసమానతలను తగ్గించడానికి ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేయవలసిందే అన్న విషయాన్ని మనం మాట్లాడుకోవలసిన పరిస్థితి ఉంది. లోటుపాట్లు ఏదైనా ఉంటే సరిదిద్దుకోవచ్చు తప్ప ఆ లోటుపాట్లు ఉన్నాయని మాట్లాడుకోకుండా బీద ప్రజానీకానికి ఈనాడు సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తోన్న ప్రభుత్వాన్ని మనమంతా అభినందించాలి తప్ప దాని గురించి వేరేవిధంగా మాట్లాడకూడదని నేను

మనివిచేస్తున్నాను. అటువంటి మంచి కార్యక్రమాలను మన గౌరవ ముఖ్యమంత్రిగారు ఈరోజు అమలు చేస్తున్నారు. సాంఘిక భద్రత పథకం క్రింద చంద్రన్న బీమా పథకం కూడా ఈరోజు గ్రామస్థాయిలో ఉండే వారందరికీ కూడా రూ.15లు చొప్పున చెల్లిస్తే, వారికి బీమా పథకం కూడా వర్తించే విధంగా ఈరోజు కార్యక్రమాలు చేయడమే కాకుండా బీదరికాన్ని సమూలంగా రూపు మాపడానికి, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండే విధంగా కూడా కార్యక్రమాలను అమలుచేయాలనే సత్సంకల్పంతో ఆంధ్ర రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ముందుకు తీసుకెళ్లడానికి అందరినీ సమానంగా చూస్తూ, కార్యక్రమాలను అమలుచేస్తోన్న రాష్ట్రప్రభుత్వానికి మనమంతా తోడ్పాటును అందించాలని సవినయంగా నేను తెలియజేసుకుంటున్నాను. సాంఘిక భద్రతా పథకం అనే ఒక మంచి కార్యక్రమం గురించి మాట్లాడే అవకాశమిచ్చిన మీకు నా హృదయపూర్వక నమస్కారాలు తెలియజేసుకుంటూ, మరొక్కసారి మంచి కార్యక్రమాలను చేస్తోన్న ప్రభుత్వానికి ప్రజలంతా కూడా బాసటగా నిలవాలనే విషయాన్ని కూడా సవినయంగా తెలియజేస్తూ శెలవుతీసుకుంటున్నాను.

శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం (స్థానిక సంస్థలు – తూర్పు గోదావరి): అధ్యక్షా, పుట్టిన ప్రతి మనిషికీ జీవించే హక్కు ఉంది. మనిషి జీవించడానికి ప్రభుత్వాలు కొంత మేరకైనా ఆదుకునే కార్యక్రమాలను చేపట్టాలి. అందులో భాగంగానే ఈ రాష్ట్రప్రభుత్వం పేదలు సంతోషంగా జీవించడానికి సామాజిక భద్రత కోసం అనేక కార్యక్రమాలను చేపట్టింది. ఎన్.టి.ఆర్. భరోసా అనే కార్యక్రమాన్ని ఈ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పెన్షన్ కార్యక్రమాన్ని భారతదేశంలోనే ఏ రాష్ట్రం చేయనటువంటి రీతిలో అమలుచేస్తోంది. అయితే, ఎన్.టి.ఆర్. భరోసా పథకాన్ని ఒకసారి మనం పరిశీలించినట్లయితే అనేక వర్గాల వారికి మనం పెన్షన్లు అందిస్తున్నాము. మొట్టమొదట స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారు ఈ పెన్షన్ పథకాన్ని ప్రవేశపెడితే, శ్రీ చంద్రబాబునాయుడు గారు ఆనాడు రూ.75 లు పెన్షన్‌గా ఇవ్వడం జరిగింది. ఆ మొత్తాన్ని స్వర్గీయ శ్రీ వై.యస్.రాజశేఖర రెడ్డి గారు రూ.200 లకు పెంచితే, ఈనాడు మళ్లీ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఆ మొత్తాన్ని ఐదు రెట్లకు పెంచి రూ.1000 ల నుంచి రూ.1500ల చొప్పున వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పెన్షన్లను ఇవ్వడం జరుగుతోంది. మొత్తం సుమారు 45,68,329 మంది లబ్ధిదారులకు రాష్ట్రంలో పెన్షన్‌ను అందించడం జరుగుతోంది. ప్రతి నెల సుమారు రూ.490 కోట్లు ఈ పథకం కోసం రాష్ట్రప్రభుత్వం ఖర్చుచేయడం జరుగుతోంది. ప్రతిపక్షాలు ఏమి చెప్పినా వాస్తవాలను ఎవరైనా అంగీకరించక తప్పదు. 2013-14 సంవత్సరంలో నెలకు పెన్షన్ల కోసం రూ.102.48 కోట్లు మాత్రమే గత ప్రభుత్వం ఖర్చుచేసింది. అంటే, సంవత్సరానికి రూ.1,237.8 కోట్లు పెన్షన్ల కోసం ఆనాటి ప్రభుత్వం ఖర్చుపెడితే, నేటి ప్రభుత్వం లోటు బడ్జెట్‌లో ఉన్నా, 2014-15 సంవత్సరానికి రూ.3,811.42 కోట్లు, 2015-16 సంవత్సరంలో రూ.5,307.97 కోట్లు, 2016-17 సంవత్సరంలో రూ.5,477 కోట్లు పెన్షన్ల కోసం మన రాష్ట్రంలో ఖర్చుచేయడం జరిగింది. ఆ మొత్తం 2017-18 సంవత్సరానికి రూ.5,906 కోట్లకు పెరిగింది. కేవలం పెన్షన్లు మాత్రమే కాక ఈ ప్రభుత్వం ప్రజలకు ఆహారభద్రతను కూడా కల్పించింది. అయినా, దురదృష్టం ఏమింటంటే, రూ.5,966 కోట్లు 45.68 లక్షల మందికి పైగా పెన్షన్లను ఈ రాష్ట్రప్రభుత్వం ఇస్తోందని చెబుతున్నా, మిగిలిన లబ్ధిదారులు ఎవరైనా ఉంటే కనీసం వారి గురించి కూడా చెప్పలేని పరిస్థితిలో ఈనాడు ప్రతిపక్ష సభ్యులు ఉన్నారు. ఆ పని కూడా మేమే చేస్తున్నాము. జన్మభూమి కార్యక్రమాన్ని పెట్టి చేసిన పనులను చెబుతూ, చెయ్యవలసిన, మిగిలిపోయిన లబ్ధిదారుల జాబితాను మళ్లీ తయారుచేసి, రాబోయే కాలంలో అవి కూడా పూర్తిచేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లడం జరుగుతోంది.

అధ్యక్షా, ఆహార భద్రత పథకం గురించి కూడా మనందరికీ తెలుసు. వారు ఆ పథకం క్రింద గతంలో ప్రతి ఒక్కరికీ నాలుగు కిలోల బియ్యం ఇచ్చేవారు. మేము దానిని ఐదు కిలోలకు పెంచడం జరిగింది.

గతంలో  కుటుంబానికి నెలకు 20 కిలోల సీలింగు ఉండేది. నేడు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ 20 కిలోల సీలింగ్‌ను తీసివేసి ఆ కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి ఆహారభద్రత కోసం  ప్రతి ఒక్కరికీ 5 కిలోల బియ్యం చొప్పున  ఇవ్వడం జరుగుతోంది.

అధ్యక్షా, 1947 సంవత్సరంలో మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన విషయం మనందరికీ తెలుసు. పేదవాడి సంక్షేమం గురించి ఆలోచించింది ఒక్క శ్రీ  నందమూరి తారక రామారావు గారు మాత్రమే అని చెప్పవచ్చు. ఆయన తెలుగుదేశం పార్టీని స్థాపించి, అత్యంత తక్కువ సమయంలో అధికారాన్ని చేపట్టి పేదవాడి గురించి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలులోకి తేవడం జరిగింది.  ఆ మహానుభావుడిని ఆదర్శంగా తీసుకుని, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ  పథకాలన్నింటినీ శ్రీ చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో తెలుగుదేశం ప్రభుత్వం కొనసాగిస్తోంది.   రాష్ట్రంలో లోటుబడ్జెట్ ఉన్నా, పేదరికాన్ని పారద్రోలాలనే ఉద్దేశ్యంతో  ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులను ఇచ్చి, వారికి అన్ని రకాల సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తోంది.

అధ్యక్షా, ప్రతిపక్ష సభ్యులు  మాట్లాడుతూ, పేదలకు ఇళ్ల గురించి కూడా ప్రస్తావించారు. గత ప్రభుత్వంలో ఇందిరమ్మ  ఇళ్లు ఫేజ్-1, ఫేజ్-2 క్రింద వందలాది, వేలాది ఎకరాల భూమిని  బినామీలతో లబ్దిదారులను  ఎంపికచేయడం జరిగింది.  భూములు అక్కడున్నాయి, పట్టాలు వీళ్ల చేతుల్లో  ఉన్నాయి. వాటన్నింటినీ క్రమబద్దీకరణ చేసి ఈ కార్యక్రమాన్ని కూడా దిగ్విజయంగా ముందుకు తీసుకువెళ్లి పేదవాడికి ఇల్లు కూడా ఇవ్వాలనే ఆలోచనతో  ఈ ప్రభుత్వం ముందుకు వెళ్లాలని తమరిద్వారా నేను మంత్రిగారిని కోరుతున్నాను. 45,68,329 మంది లబ్దిదారులకు రాష్ట్రంలో మనం పెన్షన్లను ఇస్తున్నాము. ఇంకా ఎన్ని పెన్షన్లు మిగిలిపోయాయో ఆ లబ్దిదారులకు కూడా పెన్షన్లను మంజూరుచేసి నూటికి నూరుశాతం లబ్దిదారులకు ప్రయోజనం చేకూరే విధంగా ఆలోచన చేయాలని తమరిద్వారా మంత్రిగారికి విజ్ఞప్తిచేస్తున్నాను.  ఈ అవకాశం ఇచ్చిన తమరికి నా ధన్యవాదాలు తెలియజేస్తూ  శెలవుతీసుకుంటున్నాను.

శ్రీ అంగర రామ మోహన్ ( స్థానిక సంస్థలు - పశ్చిమ గోదావరి):  అధ్యక్షా, పెన్షన్ల విషయంలో రాష్ట్రప్రభుత్వం చాలా గొప్ప కార్యక్రమం చేపట్టింది.   కేంద్రప్రభుత్వం నుంచి రాష్ట్రానికి  కేవలం రూ.284 కోట్లు మాత్రమే పెన్షన్ల కోసం చాలా తక్కువ సహాయం అందుతున్నా  రాష్ట్రప్రభుత్వం సంవత్సరానికి రూ.6 వేలకోట్లు పెన్షన్ల కోసం ఖర్చుచేయడం అనేది చిన్న విషయం కాదు. గతంలో గీత కార్మికులకు, చేనేత కార్మికులకు సభ్యులు ఎక్కువగా ఉన్నచోట ప్రత్యేక కోటా అమలులో ఉండేది. గీత కార్మికులు, చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వారికి అధిక ప్రాధాన్యతను కల్పించి  ప్రత్యేక కోటా ద్వారా వారందరికీ పెన్షన్లు అందజేయాలని నేను తమరిద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

మ. 02.00

శ్రీ వెంకట సతీష్‌కుమార్ రెడ్డి సింగారెడ్డి (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా,  ఈ సభకు వచ్చి దాదాపు ఆరు సంవత్సరాలైంది.   ఒక రెండు, మూడు రోజుల్లో నా టర్మ్ కూడా అయిపోతోంది.  గడిచిన ఆరు సంవత్సరాల నుంచి  ఈ సభలో మీ అందరి మధ్యన ఉండడం, చిట్టచివరిగా ఈరోజు సాంఘిక భద్రతా పథకాల గురించి మాట్లాడడానికి అవకాశం కల్పించినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి ఈ రాష్ట్రంలోకానీ, దేశంలోకానీ అమలవుతున్న సంక్షేమ పథకాలను  ఒకసారి పోల్చిచూస్తే న భూతో న భవిష్యతి  అన్నట్లుగా ఈరోజు  రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ఏరులై పారుతున్నాయి.

తెలుగుదేశం ప్రభుత్వం 2014వ సంవత్సరం అధికారంలోకి వచ్చిన తరువాత ఒకవైపు రూ.16,000కోట్ల లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ, ఆ లోటును ప్రజలపైన, సంక్షేమంపైన ఏమాత్రం పడకుండా అన్ని వర్గాల ప్రజలనూ ముఖ్యమంత్రిగారు ఏ విధంగా ఆదుకున్నారో మనందరికీ స్పష్టంగా అర్థమవుతోంది. రైతు ఋణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తే, అది అసాధ్యమనీ, ఇప్పుడున్న పరిస్థితిలో రైతుల ఋణాలన్నీ ఎలా మాఫీచేస్తారని అనేక బహిరంగ సభల్లో అందరూ చెప్పారు. కానీ అటువంటి పరిస్థితులలో కూడా రాష్ట్రంలోని అర్హత కలిగిన ప్రతి ఒక్క రైతుకూ ఋణమాఫీ అమలుచేశారు. రూ.50,000లోపు ఋణాలున్న రైతులకు ఒకేసారి మాఫీ చేయడం, రూ.50,000 నుంచి రూ.1,50,000 ఋణాలున్నవారికి అయిదు వాయిదాలలో అమలుచేయడం జరిగింది.

అంతేగాక రాష్ట్రంలో తొంభైలక్షలమంది డ్వాక్రా మహిళలు ఉంటే, వారిలో ప్రతి ఒక్క మహిళకూ కూడా క్యాపిటల్ ఇన్‌ఫ్యూజన్ కింద పదివేల రూపాయలు ఇవ్వడం జరిగింది. ఆర్థికపరమైన ఇబ్బందులున్నా కూడా 2014, 2015, 2016 సంవత్సరాలలో రూ.3,000చొప్పున వారికివ్వడం జరిగింది. అలాగే ఈ సంవత్సరం జూన్, జులైలో రూ.4,000వరకూ ఇవ్వడం జరుగుతుందని అనుకుంటున్నాను. అంతేగాకుండా గౌరవ సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యంగారు చెప్పినట్లు కుటుంబంలోని ప్రతి ఒక్క వ్యక్తికి గతంలో నాలుగు కేజీలచొప్పుల రేషన్‌ను అందచేస్తే, ఆహారభద్రత చట్టం తీసుకువచ్చి ప్రస్తుతం అయిదు కేజీల వరకూ అందచేస్తున్నారు. అదేవిధంగా ఇంతకుముందు ఎంతమంది కుటుంబ సభ్యులున్నా రేషన్‌కార్డుదారుకు 20 కేజీల రేషన్‌ను మాత్రమే అందచేయాలనే శ్లాబ్ ఉండేది. అలాకాకుండా ఈరోజు ఎంతమంది సభ్యులుంటే అంతమందికి అన్ని అయిదు కేజీల చొప్పున ఇవ్వాలనే నిర్ణయం తీసుకుంటున్నారు.

ప్రస్తుతం పెన్షన్‌ను రూ.1,000 నుంచి రూ.1,500 వరకు పెంచారు. వికలాంగులకైతే రూ.1,500 వరకూ ఈరోజు పెన్షన్ ఇస్తున్నారు. ఇదికాకుండా అన్నిటికంటే గొప్పదైన చంద్రన్నబీమా అనే పథకాన్ని తీసుకురావడం జరిగింది. ఒక సాధారణమైన వ్యక్తి పదిహేను రూపాయల ప్రీమియం కట్టి చంద్రన్నబీమా పథకం తీసుకుంటే ప్రమాదంలో చనిపోతే అయిదు లక్షల రూపాయలు, సహజ మరణమైతే రూ.30,000 ఆ కుటుంబానికి ఇవ్వడంతోపాటు ఇంట్లోని చదువుకుంటున్న వారసులందరికీ కూడా విద్యని అందించే పథకమిది.

అదేవిధంగా ఎన్.టి.ఆర్ వైద్యసేవ ద్వారా అంతకుముందున్న వ్యాధులకు చికిత్సనందించడమే కాకుండా దాని పరిమితిని కూడా పెంచారు. గతంలో లక్షా యాభైవేల రూపాయల వరకే చికిత్సకు అవకాశముంటే ఇప్పుడు రెండు లక్షల రూపాయల పైన అయ్యే చికిత్సకు ఎన్.టి.ఆర్ వైద్య సేవద్వారా పెంచడం జరిగింది. కొన్ని వ్యాధులకు ఎన్.టి.ఆర్ వైద్యసేవ వర్తించదు కాబట్టి ముఖ్యమంత్రిగారి ద్వారా ఆర్థిక సహాయం అందించమని మా దగ్గరికి ఎంతోమంది వచ్చేవారు. నా టర్మ్‌లో నేను ఇప్పటివరకూ రెండువేలమందికి పైగా వ్యాధిగ్రస్తులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కులిచ్చి ఆదుకోవడం జరిగింది. కాబట్టి, ఇటువంటి జనరంజకమైన, పేదలను ఆదుకున్నటువంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. అయితే అర్హత ఉండి ఇంకా మంజూరుకానివారు 10, 15 శాతం ఉంటారు. వాళ్ళందరికీకూడా త్వరితగతిన ఇప్పించాలని కోరుకుంటూ, ప్రత్యేకంగా రాష్ట్రంలో ఇంత జనరంజకంగా, సామాన్య ప్రజలందరూ కూడా వాళ్ళకి అవసరమైన అన్ని సౌకర్యాలు ఇస్తున్నటువంటి ఈ ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ అవకాశమిచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

MR CHAIRMAN: Now, reply by the Hon'ble Minister on Social Security Schemes.

శ్రీమతి కిమిడి మృణాళిని: ఈరోజు సామాజిక భద్రతా పథకాలకు సంబంధించి స్వల్ప వ్యవధి చర్చపై నాకు అవకాశం కల్పించిన మీకు ధన్యవాదాలు. ముందుగా గౌరవ సభ్యులు గోవిందరరెడ్డిగారు, రాజేంద్రప్రసాద్‌గారు, చంద్రశేఖరరావుగారు, జగదీశ్వరరావుగారు, గాదె శ్రీనివాసులునాయుడుగారు, యండపల్లి శ్రీనివాసులుగారు, అంగర రామమోహన్‌గారు, రెడ్డి సుబ్రహ్మణ్యంగారు, సతీష్‌కుమార్‌గారు ఈ కార్యక్రమాలగురించి చాలా వివరంగా, విపులంగా మాట్లాడడం జరిగింది.

మొట్టమొదటిగా 1983 సంవత్సరంలో గౌరవనీయులు, తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అప్పటి ముఖ్యమంత్రివర్యులు ఎన్.టి.రామారావుగారు రాష్ట్రంలో పేద ప్రజానీకానికి కూడు, గుడ్డ, నీడ అనేవి అత్యవసరమనే ఉద్దేశంతో వీటికి ప్రాధాన్యతనిస్తూ ఆరోజు సంక్షేమ కార్యక్రమాలను, పెన్షన్స్‌ను మొట్టమొదటిసారిగా ప్రారంభించడం జరిగింది. అయితే ప్రధానంగా రాష్ట్ర విభజన జరిగిన తరువాత రూ.16,000 కోట్ల లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ, ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలనే ఉద్దేశంతో పేదలందరికీ సురక్షితమైన, గౌరవ ప్రదమైన జీవితమివ్వాలనే ఉద్దేశంతో 2014 సంవత్సరంలో రూ.200లు ఉన్న పెన్షన్‌ను అయిదురెట్లు పెంచుతూ రూ.1,000లు చేసిన ఘనత గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారికే దక్కుతుందనే విషయాన్ని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అదేవిధంగా 80శాతం కన్నా ఎక్కువ వైకల్యమున్న వికలాంగులకు రూ.500 నుంచి రూ.1,500 వరకూ పెన్షన్ ఇవ్వడం జరిగింది. వృద్ధులకు రూ.1,000 ఇవ్వడంవల్ల వారు ఈ రాష్ట్రంలో చాలా ఆనందంగా, సంతోషంగా, గౌరవ ప్రదంగా ఉన్నారనే విషయాన్ని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. జన్మభూమి కార్యక్రమంలో మేము పెన్షన్ పంపిణీ చేసేటప్పుడు, నా పెద్ద కొడుకు చంద్రబాబునాయుడుగారు మాకు పెన్షన్ ఇచ్చాడని అత్యంత వృద్ధులు కూడా చెప్తుంటే మాకందరికీ కూడా ఎంతో గర్వకారణంగా భావిస్తూ మేము చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాము. నెలకు సుమారు 46లక్షల పెన్షన్స్‌కోసం రూ.490 కోట్లు అందచేస్తున్నాము. అక్టోబర్ 2, 2014 సంవత్సరానికి ముందు అప్పటి ప్రభుత్వం నెలకు రూ.102.48 కోట్లు, సంవత్సరానికి రూ.1,237.08 కోట్లు ఇవ్వడం జరిగేది. దానిని మా ప్రభుత్వం అయిదురెట్లకు పెంచడం వల్ల 2014-15లో రూ.3811.42 కోట్లు, 2015-16లో రూ.5307.97 కోట్లు, 2016-17లో రూ.5477.40 కోట్లు ఇవ్వగా, 2017-18 సంవత్సరంలో 46.19 లక్షల మంది పెన్షన్‌కొరకు రూ.5906 కోట్లు ఇవ్వడం జరుగుతోంది. 9,50,000 మంది పెన్షన్స్‌కుగాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రూ.284.14 కోట్లు సహకారం కేంద్రప్రభుత్వం అందచేస్తోంది. అయితే ఇందులో పారదర్శకతకు పెద్దపీట వేయడం జరుగుతుంది. ఎందుకంటే పేదవాళ్ళు, నిరుపేదలు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు ఇలా అందరూ కూడా ప్రభుత్వం మీద పెన్షన్స్‌కోసం ఆధారపడడం జరుగుతోంది. ఈ పరిస్థితిలో ప్రతీ పైసా కూడా లబ్ధిరులకు అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది.

మ. 02.10

ఎందుకంటే పేదవారు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు అందరూ కూడా ఈ ప్రభుత్వం మీద ఆధారపడి పెన్షన్ కోసం నెల వచ్చేసరికి ఎదురుచూసే పరిస్థితులలో ప్రభుత్వం నుండి వచ్చే ప్రతీ పైసా లబ్ధిదారులకు అందాలనే ఉద్దేశంతో పారదర్శకతకు ఈ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నది. ఈరోజు ఆధార్ అనుసంధానంతో 99 శాతం మందికి పెన్షన్‌లు పంపిణీ చేయడం జరుగుతుంది. ట్యాబ్స్ ద్వారా పంపిణీ చేస్తున్నాము. బయోమెట్రిక్ విధానంలో వేలిముద్రల ద్వారా, ఐరిస్ విధానం ద్వారా పంపిణీ చేయడం జరుగుతోంది. ఈ రెండూ కూడా ఫెయిల్ అయితే గ్రామ

వి.ఆర్.ఓ authentication ద్వారా పంపిణీ చేయడం జరుగుతుంది. అదేవిధంగా ఇతర ప్రాంతాలకు లేదా వలసలు వెళ్లినప్పుడు, దూర ప్రాంతాలలో ఉండి పెన్షన్ తీసుకోలేకపోయామనే ఇబ్బంది పడకుండా ఎక్కడుంటే అక్కడ పెన్షన్ తీసుకునే విధంగా పోర్టబులిటీకి అవకాశం ఇవ్వడం జరిగింది. ఈ విధంగా ఇస్తూనే ప్రతి పెన్షనర్‌ను 6 దశల్లో వ్యాలిడేషన్ చేస్తూ, వాళ్లయొక్క అర్హతను బట్టి నిజమైన పేదవాళ్లు ఎవరైతే ఉన్నారో బి.పి.యల్ క్రింద ఉన్నవారికి ఈ పెన్షన్‌లు ఇవ్వడం జరుగుతుంది. గౌరవ పెద్దలు విప్‌గారు చెప్పినట్లు కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు వారి యొక్క సంఘాల ద్వారా నిర్ధారణ చేసి పెన్షన్‌లు ఇస్తే న్యాయపరంగా ఉంటుందని చెప్పారు. తప్పకుండా ఆ విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేస్తున్నాను.

రెండవ అతిపెద్ద కార్యక్రమం రేషన్. ఈ రాష్ట్రంలో 8 లక్షల 75 వేల తెల్లరేషన్ కార్డులను జనవరి 2017వ సంవత్సరంలో నాలుగో విడత జన్మభూమి కార్యక్రమంలో ఇవ్వడం జరిగింది. ప్రస్తుతం మన రాష్ట్రంలో 1,42,02,891 బి.పి.ఎల్ కార్డులు ఉన్నాయి. అందులో తెల్లరేషన్ కార్డులు 1,32,66,612, అంత్యోదయ కార్డులు 9,24,421, అన్నపూర్ణ కార్డులు 11,958. ఇవి కాకుండా మన రాష్ట్రంలో 14,87,033 పింక్ కార్డులు ఉన్నాయి. ఈ విధంగా రేషన్ కార్డులు ఇస్తూ, గౌరవ ముఖ్యమంత్రిగారు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక అని సరుకులు ఇవ్వడం జరుగుతుంది. ఇందులో మొత్తం ఆరు దినుసులు ఉంటాయి. పండుగ అంటే కేవలం డబ్బున్నవాళ్లే కాదు, పేదవాళ్లు కూడా చక్కగా జరుపుకోవాలని ఆరు దినుసులను ఉచితంగా ఇస్తున్నారు. పండుగ నాడు పప్పన్నం, నెయ్యితో ప్రతీపేదవాడు సంతోషంగా తినాలని గౌరవ ముఖ్యమంత్రిగారు ఇచ్చారు.

అదేవిధంగా ఫుడ్ సెక్యూరిటీ క్రింద ప్రతీ పేదవాడికి అదనంగా 1 కేజీ బియ్యం పెంచుతూ, 4 కేజీలను 5 కేజీలకు పెంచడం జరిగింది. కుటుంబంలో ఎంతమంది సభ్యులున్నా, ప్రతీ ఒక్కరికీ కూడా నాలుగు కేజీల నుండి ఐదు కేజీలకు పెంచుతూ అందరికీ అందేవిధంగా చర్యలు తీసుకోవడం జరిగింది. పేదవారి కళ్లల్లో ఆనందం చూడాలని ముఖ్యమంత్రి గారు ఈ సంక్షేమ కార్యక్రమాలను చేస్తున్నారు.

అదేవిధంగా హౌసింగ్ ప్రోగ్రాం గురించి మాట్లాడుకుంటున్నాము. ఎన్.టి.ఆర్. రూరల్ హౌసింగ్ క్రింద 2 లక్షల ఇళ్లు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ఎన్.టి.ఆర్. రూరల్ హౌసింగ్ క్రింద గ్రామీణ ప్రాంతాల్లో 72,885 ఇళ్లు ఇవ్వడం జరిగింది. ఎన్.టి.ఆర్. హౌసింగ్ (అర్బన్) బి.ఎల్.సి. క్రింద 73,041, స్పెషల్ హౌసింగ్ క్రింద 9,170, ఈ విధంగా 3,55,096 ఇళ్లను రూ.7,413.76 కోట్లతో చేపట్టడం జరుగుతుందని తెలియజేస్తున్నాను. అదేవిధంగా గత ప్రభుత్వంలో శాంక్షన్ అయ్యి అసంపూర్ణంగా ఉన్న ఇళ్లను పూర్తి చేసుకుంటామని ముందుకు వస్తే అటువంటి వారికి నిధులు ఇవ్వడానికి ముఖ్యమంత్రి గారు శాంక్షన్ ఇవ్వడం జరిగింది. ప్రీ ఎన్.టి.ఆర్ హౌసెస్ ఎల్.ఎల్(లింటిల్ లెవల్), ఆర్.ఎల్(రూఫ్ లెవల్) స్థాయిలో ఉన్న 1,15,801 ఇళ్లకు రూ.337.14 కోట్లను కేటాయించడం జరిగింది. అదేవిధంగా బేస్‌మెంట్, బిలో బేస్‌మెంట్ లెవల్ హౌసెస్ 1,78,108 ఉన్నాయి, ఇవి పూర్తి చేసుకోవడానికి ముందుకు వచ్చిన ప్రతీ ఒక్కరికీ నిధులు ఇవ్వడం జరుగుతుందని తెలియజేస్తున్నాను. అదేవిధంగా బిఎల్, బిపిఎల్ హౌసెస్ ఏవైతే ఉన్నాయో అవి ఇప్పటికే వాళ్లు కట్టుకుని, రూఫ్ లెవల్‌కు వచ్చిన వాటికి వెంటనే పేమెంట్స్ ఇవ్వడానికి 32,000 ఇళ్లు ఉన్నాయి, అందుకు రూ.200 కోట్లను కేటాయించడం జరిగింది. అదేవిధంగా ప్రీ ఎన్.టి.ఆర్ అప్‌గ్రేడేషన్ అని 2004వ సంవత్సరం కంటే ముందు నిర్మించిన ఇళ్లు రాష్ట్రంలో ఉండి అవి రిపేర్లకు కావాలి అనుకుంటే రూఫ్, ఫ్లోరింగ్, గోడలు ప్లాస్టింగ్ చేసుకోవడానికి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ప్రతీ ఇంటికి రూ.10,000/- తక్కువ కాకుండా శాంక్షన్స్ ఇవ్వడానికి రూ.150 కోట్లు కేటాయించారు. ఈ విధంగా ఈ రాష్ట్రంలో ఎవరైనా 2004వ సంవత్సరం కంటే ముందు

నిర్మించిన ఇళ్లకు రిపేర్లు చేయించుకోవడానికి దరఖాస్తు చేసుకుని చేయించుకునే అవకాశాన్ని గౌరవ ముఖ్యమంత్రిగారు కల్పించారనే విషయాన్ని ఈ సభ ద్వారా తెలియజేస్తున్నాను. కొత్త బడ్జెట్‌లో నాలుగు లక్షల ఇళ్లను ఈ సంవత్సరం మరియు వచ్చే సంవత్సరంకు కూడా గౌరవ ముఖ్యమంత్రి గారు శాంక్షన్ చేయడం జరిగింది. గృహనిర్మాణంలో మా ప్రభుత్వం చాలా పారదర్శకంగా ఉంటుందని తెలియజేస్తున్నాను. ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు హౌసింగ్ కార్పోరేషన్ నుండి నేరుగా వారి ఖాతాలోకి జమ చేయడం జరుగుతుంది.

ఈ విధంగా హౌసింగ్ కార్యక్రమాలు చేస్తూ, వినూత్నంగా చంద్రన్న బీమా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఇందులో 2 కోట్ల 10 లక్షల మంది అసంఘటిత కార్మికులు భవన నిర్మాణాలలో, కర్మాగారాలలో పనిచేస్తున్నారు. పని చేస్తున్న చోట అనుకోని సంఘటనలు జరగాలని ఎవరూ కోరుకోరు, కానీ దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగి మరణిస్తే రూ.5లక్షలు, పూర్తిగా వికలాంగులు అయితే రూ.5లక్షలు, పాక్షికంగా వికలాంగులు అయితే రూ.3,62,000/-, సహజ మరణం పొందితే రూ.30,000/- అటువంటి కుటుంబంలో చదువుకుంటున్న పిల్లలకు 9, 10వ తరగతులు, ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాలకు గాను సంవత్సరానికి రూ.1,200/- చొప్పున ఇవ్వడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అలాగే అంగన్‌వాడీస్ గురించి పెద్దలు విపులంగా మాట్లాడడం జరిగింది. అంగన్‌వాడీ సెంటర్లలో ఎవరైతే చిన్న పిల్లలు ఉన్నారో 3 నుండి 6 సంవత్సరాల పిల్లలకు ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ ఇప్పించడానికి, అదేవిధంగా అక్కడ ఉన్న పిల్లలకు న్యూట్రీషియస్ ఫుడ్ ఇవ్వడానికి ప్రభుత్వం 7 నెలల నుండి 3 సంవత్సరాల లోపు వయసు ఉన్న పిల్లలకు వారానికి రెండు గుడ్లు, 3 నుండి 6 సంవత్సరాల వయసు ఉన్న పిల్లలకు వారంలో నాలుగు గుడ్లు ఇస్తూ, మధ్యాహ్నం అన్నం, ఆకుకూర పప్పు గాని, అన్నం సాంబారు ఇవ్వడం జరుగుతుంది. అదేవిధంగా సాయంత్రం పూట కూడా న్యూట్రీషియస్ ఫుడ్ ఇవ్వాలని నల్లబతాణీలు ఇవ్వడం జరుగుతోంది. అదేవిధంగా భోజనం ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, మలవిసర్జనం తరువాత కూడా చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, పరిశుభ్రంగా ఉండాలని మంచి అలవాట్లు నేర్పుతూ, ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కూడా ఇవ్వడం జరుగుతుంది.

అదేవిధంగా గర్భిణీ స్త్రీల గురించి, బాలింతల గురించి కూడా ప్రస్తావించడం జరిగింది. అయితే ప్రత్యేకంగా గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వం ఇమ్యునైజేషన్ క్రింద టీకాలిస్తున్నాము. ప్రతీ మహిళ కూడా చైతన్యవంతంగా మంచి ఆహారం తీసుకోవాలి, ప్రభుత్వ పరంగా మెడికల్ సెంటర్స్‌లో ఇస్తున్న ఐరన్, ఫోలిక్ యాసిడ్ మందులు, అదేవిధంగా కాల్షియం మందులు తీసుకోవాలి, రక్తహీనత లేకుండా చూడాలి, డెలివరీ టైంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఇంట్లో కాకుండా హాస్పిటల్స్‌లో డెలివరీ జరిగేలా చూడాలి. వందశాతం హాస్పిటల్స్‌లోనే డెలివరీలు జరగాలనే నేపథ్యంలో ప్రభుత్వం పనిచేస్తూ, ఐఎంఆర్, ఎంఎంఆర్ రేటు తగ్గించాలని ప్రతీ నెల గ్రామస్థాయిలో మండలస్థాయి, జిల్లాస్థాయిలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలతో ఈ కార్యక్రమాలను చేపడుతున్నారు. ఒక గర్భిణీ స్త్రీ ఏవిధమైన జాగ్రత్తలు తీసుకోవాలి అనే విధానంలో, గర్భిణీ స్త్రీ డెలివరీ టైంలో ఆరోగ్యంగా ఉంటే బిడ్డకూడా ఆరోగ్యంగా ఉంటుంది కాబట్టి ఐఎంఆర్ రేటు తగ్గించడానికి ప్రతీ మహిళా కూడా హాస్పిటల్‌లోనే డెలివరీ అవ్వడానికి ఖచ్చితమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

మ.2.20

శ్రీమతి కిమిడి మృణాళిని: అధ్యక్షా, ఈ జన్మభూమి కార్యక్రమాలలో భాగంగా ప్రతి గర్భిణీ మహిళకు సీమంతం చేస్తున్నాము. ఆరోజున ఆ మహిళకి పసుపు, కుంకుమ, తాంబూలం ఇవ్వడమే గాక, పోషకాహారాన్ని కూడా మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా వారికి ఇవ్వడం జరుగుతోంది. అక్కడ ఏప

పోషకాలు వారికి అందిస్తారు, ఏఏ పోషకాహారాలు వారి ఆరోగ్య రక్షణ కొరకు తీసుకోవాలనేది తెలిసేవిధంగా అంటే ఆకుకూరలు, పండ్లు, మనకు అందుబాటులో ఉండే పోషకపదార్థాలను డిస్ప్లే చేయడం జరుగుతోందని మీకు తెలియజేస్తున్నాను. ఈరోజు సామాజిక భద్రత కోసం గౌరవ ముఖ్యమంత్రిగారి నేతృత్వంలో ఈ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. నలభైఆరు లక్షల మందికి పెన్షన్లు, సుమారు కోటీ ముప్పై లక్షల మందికి పైగా రేషన్ కార్డుల ద్వారా నిత్యావసర సరకులు ఇవ్వడం, అదేవిధంగా అసంఘటిత కార్మికులకు చంద్రన్న బీమా పథకం ద్వారా ప్రతీసారి రెండుకోట్ల పదిలక్షల మందికి ఇమీడియట్‌గా డబ్బులు ఇచ్చి ఆ కుటుంబాలకు రక్షణ కల్పించే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతోంది. ఈవిధంగా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఈ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని మీ ద్వారా ఈ సభకు, రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ దేవసాని చిన్న గోవింద రెడ్డి(శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, ఈ రేషన్ సరకుల విషయాన్ని నేను సభ దృష్టికి తీసుకువచ్చాను. గతంలో తొమ్మిది రకాలు సరకులు ఇచ్చేవారు. కానీ, ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చే సరకులు కేవలం బియ్యం, చక్కెర. ఈ చక్కెర కూడా ఇంతకు ముందు అరకేజీ ప్యాకెట్లుగా ఇచ్చేవారు. ఇప్పుడు రేషన్ షాపులలో దీనిని లూజ్‌గా సప్లై చేయడం జరుగుతోంది. దీనివల్ల ఇచ్చే ఆ అరకేజీ చక్కెరలో కూడా 70 నుంచి 80 గ్రాముల వరకూ తగ్గుతుంది. అంటే తొమ్మిది సరకులకు గానూ, వీరిచ్చేది కేవలం రెండు సరకులే. ఈ విషయంలో క్లారిటీ ఇవ్వాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

రెండోది 4 లక్షల ఇళ్లను పేదలకు ప్రభుత్వం మంజూరు చేస్తే, దానిలో ఇప్పటి వరకు కేవలం 32,000 ఇళ్లు మాత్రమే సంవత్సరంలోకట్టామన్నారు. అంటే 6 నుంచి 7 శాతం వరకు మాత్రమే ఇళ్లను నిర్మించింది. అంటే ప్రభుత్వం ఇచ్చిన శాంక్షన్‌కు, కట్టిన ఇళ్లకు చాలా తేడా ఉంది. కాబట్టి, ప్రభుత్వం ఈ ఇళ్లేనా, మిగతా ఇళ్లను కూడా పూర్తి చేస్తారా అనే విషయంలో శ్రద్ధ చూపి, పేద వారికి ఇచ్చే ఈ ఇండ్ల కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తి చేయగలదా అన్న విషయంలో క్లారిఫికేషన్ ఇవ్వవలసిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు: అధ్యక్షా, మంత్రిగారిచ్చిన రిప్లైలో, అసంఘటిత కార్మికులకు ఇచ్చే బెనిఫిట్స్‌కి సంబంధించి చంద్రన్న బీమా పథకం నిర్మాణ రంగ కార్మికులకు, పరిశ్రమలలో పని చేసే కార్మికులకు వర్తిస్తుందని చెప్పారు. ఇది తప్పు. నిర్మాణ రంగ కార్మికులకు ప్రత్యేకంగా ఒక పథకం ఉన్నది. ఆ పథకం ప్రకారం వాళ్లు ఒక సెస్ కలెక్ట్ చేసి, దానిలోనుంచి ఈ కార్మికులకు ఇస్తారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులు ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ యాక్టు, ఫ్యాక్టరీస్ యాక్టు, ఇఎస్ఐ, ప్రావిడెంటు ఫండ్ చట్టాలలో కవర్ అయ్యి ఉంటారు. వీరికి ఈ చంద్రన్న బీమా పథకం వర్తించదు. దానిని సరిచేసుకోవాల్సి ఉంది.

రెండోది, నేను మంత్రిగారి ప్రసంగంలో ఎక్స్‌పెక్ట్ చేసిందేమంటే, సంఘటిత రంగంలో ఉన్న మహిళలు వారు గర్భస్థ సమయంలో గానీ, బాలింతలుగా ఉన్నప్పుడు, వారికిచ్చే సెలవులు గతంలో తొంభైరోజులు సెలవులు ఉంటే వాటిని ఇప్పుడు 180 రోజులకు పెంచడానికి కేంద్రప్రభుత్వం ఆమోదం ఇచ్చింది. 90 రోజులు అయినా, 180 రోజులు అయినా అసంఘటిత రంగంలో ఉండి రోజూ కూలి నాలి చేసుకుని బ్రతికేవాళ్లు దాదాపు కోటిమంది మహిళలు ఈ అసంఘటిత రంగంలో ఉన్నారు. వీరిలో గర్భం దాల్చిన దగ్గర నుంచి ఇంకా రెండు మూడురోజులలో ప్రసవం జరుగుతుంది అనేంత వరకు ఎండ, గాలి, వాన అని లెక్క చేయకుండా పనులకు వెళ్లి డబ్బులు సంపాదించుకుంటేనే గానీ సంసారం గడవనటువంటి పరిస్థితుల్లో మహిళలు ఉన్నారు. వారు గర్భం దాల్చిన తరువాత ప్రసవించడానికి దగ్గరలో ఉన్న సమయం నుండి ప్రసవించిన తరువాత కేంద్రప్రభుత్వం సంఘటిత రంగంలోని మహిళాకార్మికులకు ఇచ్చిన విధంగా

ఆ 180 రోజులలో వీరికి కూడా వేతనం లేదా అలొవెన్స్ లాంటిది ఇవ్వాలి. ఇలా ఇవ్వడం వల్ల వారు ఇంటి దగ్గర ఉండి రెస్ట్ తీసుకోవడానికి, వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి , ఆరోగ్యకరమైన సంతానాన్ని ఇచ్చేందుకు ఉపయోగపడుతుంది. ఇది ఒక సామాజిక ప్రక్రియ. ఇది కేవలం ఆ ఒక్క కుటుంబానికి సంబంధించిన విషయం మాత్రమే కాదు. ఒక భవిష్యత్తు తరాన్ని అందించి, ఒక ప్రాకృతికమైన సామాజిక కర్తవ్యాన్ని నెరవేరుస్తున్న ఆ తల్లుల ఎడల ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండడం, పట్టించుకోకుండా ఉండడం చేయకూడదు. గర్భిణీగా ఉన్నప్పుడు సీమంతం చేయడం, వారు తీసుకోవాల్సిన ఆహారాన్నీ డిస్ప్లే చేయడం ఇవన్నీ దేశంలో ఉన్న 29 రాష్ట్రాలలో జరుగుతున్నవే. మన రాష్ట్రంలో ప్రత్యేకంగా జరుగుతున్నది కాదు. మహిళలు, వాళ్ల సంతానం, వాళ్ల MMR, IMR మన రాష్ట్రంలో దిగజారిన ఈ పరిస్థితులలో ప్రభుత్వం సృజనాత్మకంగా ఆలోచించి, మౌలికమైన సంక్షేమ చర్యలను చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది. దీనిని ప్రభుత్వం గుర్తిస్తుందా, లేదా అనేది స్పష్టంగా తెలియజేయాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీమతి కిమిడి మృణాళిని: అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ పి.జె. చంద్రశేఖర్ రావు గారు నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులకు చంద్రన్న బీమా పథకం కింద పరిహారం ఇవ్వడం లేదని చెప్పడం జరిగింది. ఈమధ్యనే హైదరాబాదులోని నానక్‌రామ్ గూడలో ఏడంతస్తుల భవనం కూలి అక్కడ సుమారు 11మంది కార్మికులు చనిపోయిన నేపథ్యంలో, ఆ శిధిలాల కింద నుంచి వారి మృతదేహాలు వెలికి తీసేవరకు నేను అక్కడే ఉన్నాను. వారందరికీ కూడా చంద్రన్న బీమా పథకం కింద నిధులు మంజూరు చేయడం జరిగింది. భవన నిర్మాణంలో ఉన్న ప్రతి ఒక్కరినీ కూడా చంద్రన్న బీమా పథకంలో కవర్ చేయడం జరిగింది. కనుక, ఈ విధంగా నమోదు అయిన ప్రతి కార్మికునికి కూడా చంద్రన్న బీమాతో పాటు, ఇతర సంక్షేమ పథకాలను కూడా అమలు చేస్తున్నాము.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు: అధ్యక్షా, గౌరవ మంత్రిగారిచ్చిన సమాధానాన్ని సరిచేసుకోవాలని తెలియజేస్తున్నాను. ఎందుకంటే, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పది లక్షలకు పైగా జరిగిన ఏ నిర్మాణంలోనైనా రెండు శాతం సెస్ కింద ఆ బోర్డుకి చెల్లించవలసి ఉంటుంది. 1,145 కోట్ల రూపాయలు దానిలో ఉన్నాయి. నిర్మాణరంగంలో పనిచేసే కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే వారికి ఇన్స్యూరెన్స్ రూపంలో అరవై వేల రూపాయలు ఇవ్వడం జరుగుతోంది. అలాగే పనిచేస్తున్న సమయంలో వారు మరణించినట్లైతే ఐదు లక్షల రూపాయలు ఇచ్చే ఏర్పాటు ఉన్నది. నేను మీకు మనవి చేసేదేమంటే, వారిని కూడా చంద్రన్న బీమా పథకంలో కలిపి, దీనిలో ముప్పైవేలు ఇచ్చి, ఆ స్కీములో ముప్పైవేలు ఇచ్చి మొత్తంగా అరవై వేలే ఇస్తున్నారు. అది సరికాదని ప్రభుత్వానికి రిప్రజెంటేషన్ కూడా ఇవ్వడం జరిగింది. ఇంతకు ముందు అరవై వేలు ఇచ్చే దానిని, ఇప్పుడు దానిలో ముప్పైవేలు, దీనిలో ముప్పై వేల కింద చేసి ఇస్తున్నారు. ఆ సెస్‌లో ఉన్నటువంటి, 270 కోట్ల రూపాయలు ఇన్స్యూరెన్స్ ప్రీమియం కట్టి మొత్తం రెండు కోట్లమందికి మేము ఇస్తున్నామని చెబుతున్నారు. కాబట్టి, మీరు ఆ అంకెలు, లెక్కలలో జరుగుతున్న వ్యవహారాన్ని కొద్దిగా పరిశీలన చేయాలని కోరుతున్నాను.

శ్రీమతి కిమిడి మృణాళిని: అధ్యక్షా, ఇప్పుడు ఏదైతే సభ్యులు చంద్రశేఖర్ రావు గారు చెప్పారో దానిని తప్పకుండా పరిశీలిస్తాము. ఇప్పటికే గడిచిన ఈ రెండు, మూడు నెలలలో ఎవరెవరికైతే ఈ నిధులను ఇచ్చామో ఆ వివరాల్ని గౌరవ సభ్యులకు పంపడం జరుగుతుంది. భవన నిర్మాణ రంగంలో ఉన్న కార్మికులకు ఇపిఫ్, ఇఎస్ఐ బెనిఫిట్స్ ఉన్నప్పటికీ కూడా, సుమారు పదిహేను వేల రూపాయల కన్నా తక్కువ ఆదాయం ఉన్న ప్రతి ఒక్కరికీ కూడా ఈ చంద్రన్న బీమా పథకం వర్తిస్తుందనే విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగింది.

మ.2.30

అధ్యక్షా, అదేవిధంగా ఈ రోజు గర్భిణీ స్త్రీలకు సంబంధించిన కార్యక్రమాలు అన్ని రాష్ట్రాలలో జరుగుతున్న విధంగానే మన రాష్ట్రంలో కూడా జరుగుతున్నాయి అన్న విషయాన్ని గౌరవ సభ్యులు వ్యక్తం చేశారు. కానీ, అది మాత్రం కాదు. అన్ని రాష్ట్రాలలో ఎలా జరుగుతోందో నాకయితే తెలియదు కానీ, మన రాష్ట్రంలో మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడి గారి నేతృత్వంలో ఈరోజున ఐఎంఆర్, ఎంఎంఆర్ రేట్ల పైన కలెక్టర్ల కాన్ఫరెన్సుల్లోనే కాకుండా, ప్రతినెలా రాష్ట్ర స్థాయిలో సమావేశాలను ఏర్పాటు చేయడం జరుగుతోంది. అదేవిధంగా, జిల్లా స్థాయిలో కూడా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులకు సంబంధించినటువంటి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు అందరం కూడా ఈ కార్యక్రమంలో కూర్చుని, సమావేశాలను ఏర్పాటు చేసుకుని, ఐఎంఆర్, ఎంఎంఆర్ రేట్లు ఏవిధంగా ఉన్నాయి? వాటిని ఏ విధంగా తగ్గించాలి, వాటి గురించి ప్రజలలోకి ఏ విధంగా అవగాహనను తీసుకువెళ్ళాలి, మొదలైన వాటిపైన ఈ ప్రభుత్వం ఖచ్చితమైన ఆలోచనలో ఉంది. మన రాష్ట్రంలో ఐఎంఆర్, ఎంఎంఆర్ రేట్ల పైన కానీ, గర్భిణీ స్త్రీలకు డెలివరీ సమయంలో ఇచ్చేటటువంటి తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు సంబంధించిన పథకాలు మరియు పుట్టిన బిడ్డలకు ఆసుపత్రులలో ఇచ్చే బేబీ కిట్స్‌ను ఇచ్చేటటువంటి ఏర్పాట్లను ఈ ప్రభుత్వం చేస్తోంది. అదేవిధంగా, గర్భిణీ స్త్రీ డెలివరీ అయిన తరువాత ఇంటికి వెళ్ళే ముందు ఏ విధమైన సహకారం అందించాలనే విషయంలో ఈ ప్రభుత్వం చాలా ఎక్కువగా శ్రద్ధ తీసుకుంటోంది. ఆ రకంగా మహిళల ఆరోగ్యం పట్ల, పుట్టిన బిడ్డ ఆరోగ్యం పట్ల కూడా పూర్తిస్థాయిలో మా ప్రభుత్వం పనిచేస్తోందనే విషయం కూడా ఈ సందర్భంగా తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, అదేవిధంగా ఈ ప్రభుత్వం రేషన్‌కు సంబంధించి ఖచ్చితంగా ఈ-పాస్ మెషీన్లను పెట్టింది ఎందుకంటే, ఎక్కడా తూకంలో 10 గ్రాములు కూడా తేడా లేకుండా లబ్ధిదారులకు ఇవ్వాలనే ఉద్దేశ్యంతోనే ఈ యొక్క కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. అలాగే, గౌరవ సభ్యులు ఇళ్ళ గురించి అడిగారు. అందుకు సంబంధించి నేను ఖచ్చితంగా వారికి మరొకసారి తెలియజేస్తాను. రాబోయే రెండు సంవత్సరాలలో 10 లక్షల ఇళ్ళను కట్టాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రభుత్వం ముందుకు వెళుతోంది. అయితే, ఇంతవరకు స్లోడౌన్ అయిందని గౌరవ సభ్యులు అన్నారు. అయితే, ఈ స్లోడౌన్ అవడానికి గల కారణాలు కూడా గౌరవ సభ్యులు అడిగారు కనుక, అందుకు కారణాలను నేను చెప్పవలసిన పరిస్థితి వచ్చింది.

అధ్యక్షా, గత ప్రభుత్వంలో కట్టినటువంటి ఇళ్ళల్లో చాలా అవినీతి, పెద్ద ఎత్తున అక్రమాలు కూడా జరిగాయి. ఒక లబ్ధిదారుని పేరు మీద మరియు ఇద్దరు, ముగ్గురు లబ్ధిదారుల పేరు మీద ఒకరే ఇల్లు తీసుకోవడం వలన దాదాపు 14,40,000 ఇళ్ళు ఈ రాష్ట్రంలో కనిపించకుండా పోయాయనే విషయం ఈ ఆధార్, జియోట్యాగింగ్‌ల ద్వారా మనకు తేలింది. దాని విలువ సుమారుగా రూ.4,150 కోట్లు. అందువలన ఇన్ని ఇళ్ళను మేము అనుసంధానం చేసుకోవాలి. ఎక్కడా, ఏ విధమైన ఆరోపణలు లేకుండా చేయాలనే విధానంలో ఇలా ప్రతి ఒక్క ఇంటినీ జియో ట్యాగింగ్, ఆధార్ కార్డులతో అనుసంధానం చేయడం జరిగింది. అదేవిధంగా, ఈనాడు మేము క్రొత్త ఇళ్ళను కూడా ప్రారంభించడంతో పాటు, పాత ఇళ్ళను కూడా వారికి మరమ్మత్తుల కోసం ఇవ్వడం జరిగింది. ఈరోజున దాదాపు 3,55,096 క్రొత్త ఇళ్ళను పేదప్రజలకు ఇవ్వడం జరిగింది. వాటి విలువ సుమారు రూ.7,413.76 కోట్లు. పాతవి పూర్తి చేసుకోవడానికి మరియు అసంపూర్ణంగా ఉన్న ఇళ్ళను కూడా పూర్తిచేయడానికి చేపట్టిన ఇళ్ళు దాదాపు 4,34,601. వీటి విలువ రూ.2,508 కోట్లు. అంటే, మొత్తం 7,89,697 ఇళ్ళు. వీటన్నింటి విలువ దాదాపు రూ.9,921 కోట్లు. ఇవే కాకుండా, క్రొత్తగా 4 లక్షల ఇళ్ళను ఈ సంవత్సరం, వచ్చే సంవత్సరానికి గాను ఎన్‌టిఆర్ రూరల్ హౌసింగ్ పథకం క్రింద ముఖ్యమంత్రిగారు ఇవ్వడం జరిగింది.

అదేవిధంగా ఈ సంవత్సరం కూడా లబ్ధిదారుల గృహాలు మరియు ప్రధానమంత్రి ఆవాస్ యోజన క్రింద కూడా ఇళ్లు రావడం జరుగుతుంది. వీటన్నింటిని తీసుకురావడానికి ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. ఈ ఇళ్ళకు సంబంధించి ప్రతి ఒక్కరూ కూడా తమ ఇళ్ళను తాము కట్టుకుని, హాయిగా అందులో నివసించే విధంగాను, ధైర్యంగా ఉండే విధంగా మేము తగిన చర్యలు తీసుకుంటున్నాము. ఎందుకంటే మేము జన్మభూమి, జనచైతన్య యాత్ర మొదలైన కార్యక్రమముల ద్వారా అన్ని గ్రామాలలో పర్యటించేటప్పుడు అక్కడ ఇళ్ళులేని గ్రామస్తులు తమకు ఇళ్ళు కావాలని మా వద్దకు వచ్చి అడుగుతున్నారు. ఆ విధంగా గ్రామస్థాయిలో 10 మంది వరకు ఇళ్ళు కావాలంటే, ఆ పదిమంది పేర్లను తీసుకుని, మేము ఇళ్ళ యొక్క హౌసింగ్ డేటాలోకి అప్‌లోడ్ చేస్తే, అందులో నలుగురికి ఆల్‌రెడీ ఇళ్ళు మంజూరయిపోయి ఉన్నాయి. బిల్లులు కూడా అయిపోయాయనే సమాచారం వస్తోంది. ఆ గ్రామస్తులేమో మాకు ఇళ్లు మంజూరయినాయి కానీ, బిల్లులు కూడా మంజూరయినాయనే విషయం తెలియదని అంటున్నారు. ఆ గ్రామాలలోని ప్రజలు ఇలా ఏ రకంగా జరిగిందోనని చాలా బాధపడుతున్నారు. అధ్యక్షా, ఆ గ్రామ స్థాయిలో పరిస్థితి ఈ రకంగా ఉంటున్నది. ఈ విధమైన పరిస్థితులు ఈ ప్రభుత్వంలో జరగకూడదన్న ఉద్దేశ్యంతోనే ప్రతి అంశాన్ని పారదర్శకంగా చేస్తున్నాము.

అధ్యక్షా, ప్రతి ఇంటినీ కూడా బేస్‌మెంట్ లెవెల్లో అయితే, 3 ఫొటోలను జియోట్యాగ్ చేశాకే, ఈ బేస్‌మెంట్ బిల్లులు వస్తున్నాయి. అలాగే, రూఫ్ లెవెల్లో కానీ, రూఫ్ శ్లాబ్ లెవెల్లో కానీ, ఫోటోలు తీసి, జియోట్యాగింగ్ జరిపిన తరువాతే, బిల్లు పేమెంట్లు జరుగుతున్నాయి. అది కూడా వారి రేషన్‌కార్డులతో పాటు అనుసంధానం చేస్తున్నాము. అలాగే, బెనిఫిషరీ ఫోటో, ఇల్లు ఫోటో మొత్తం ఆధార్ నెంబరుతో అనుసంధానం చేసి ఇవ్వడం జరుగుతుంది. ఆ విధానం పట్ల ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. వారికి కట్టే ప్రతి ఇల్లూ భూమి మీద ఉండే విధంగా కడతాము. గత ప్రభుత్వాల వలే కాగితాల మీద లెక్కలు చూపించి, ఈ భూమి మీద లేని ఇల్లును మాత్రం కట్టము. ఆ విషయాన్ని నేను చాలా ధైర్యంగా ఈ సభలో మీ ముందు ఉంచుతున్నాను. కనుక బెనిఫిషరీలు ఎవరు ఇల్లు కట్టుకున్నా కూడా వారి ఇల్లు వారికి మంజూరు అవుతుంది. తద్వారా వాళ్ళు ఇల్లు కట్టుకుంటారు. ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రతి పైసా వారి బ్యాంకు ఖాతాలోకి వెళుతుందనే విషయాన్ని కూడా తమ ద్వారా ఈ సందర్భంగా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : పండగ రోజుల్లో 2 రకాల సరుకులే ఇస్తున్నారు, ఇంతకు ముందు ఇంకా ఎక్కువ ఇచ్చేవారని, ఇప్పుడు ఎక్కువ ఇవ్వడానికి వీలుందా అని కొంతమంది గౌరవ సభ్యులు అడిగారు.

శ్రీమతి కిమిడి మృణాళిని: అధ్యక్షా, రేషనుకు సంబంధించి మా ప్రభుత్వం అయితే, బియ్యం, పంచదార, ఆయిల్, కందిపప్పును ఇవ్వడం జరుగుతోంది. పండగకు గాను, 6 దినుసులను ఈ ప్రభుత్వం ఉచితంగా ఇస్తోంది. 9 సరుకులు ఉన్నాయనే విషయం గౌరవ సభ్యులు తెలియజేశారు. అది కూడా నేను నిన్న పౌర సరఫరాల మంత్రిగారితో మాట్లాడడం జరిగింది. ఆ విధానానికి సంబంధించిన క్లారిఫికేషన్ తీసుకుని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తాను.

MR. CHAIRMAN: Discussion is over.

## 6. సభా కార్యక్రమం – ప్రకటన

I am to announce to the House that there will be a group photo for all the Members along with the Chief Minister tomorrow during tea-break at 11.30 a.m. All are requested to attend for the group photo.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు : అధ్యక్షా, ఒక విషయాన్ని తమ ద్వారా మనవి చేయదలచుకున్నాను. మార్చి, 29వ తారీఖున చాలామంది గౌరవ సభ్యుల పదవీకాలం అయిపోతోంది. వాళ్ళకు కేవలం ఫోటో వరకేనా లేకపోతే వారు సభలో ఏమైనా అంశాలను రెయిజ్ చేయడానికి, రికార్డుల్లో పెట్టడానికి అవకాశం ఏమైనా ఉందా? ఎందుకంటే, చాలామంది అవుట్ గోయింగ్ మెంబర్లు ఉన్నారు. ఈ అంశాలు కూడా రికార్డుల్లోకి వెళితే బావుంటుంది సార్. ఛైర్ నుంచి కూడా వారిని అప్రీషియేట్ చేస్తే బావుంటుంది. వారికి ఏ సమయంలో ఇస్తారో ఆ విషయాన్ని కూడా చెపితే బావుంటుంది సార్.

MR. CHAIRMAN: I will talk to you later.

Now, the House is adjourned to meet again tomorrow at 10.00 am.

(Then the House was adjourned at 2.36pm to meet again on 28.03.2017 at 10 am)